RNI NO. TELTEL/2022/83470 ● manasakshi.in

# మనసాక్షి మీకోసం

తెలుగు దినపత్రిక ఎడిటర్: మల్లె నాగిరెడ్డి

నల్గొండ | హైదరాబాద్ | సంపుటి : 3. సంచిక :334 | పేజీలు 8

ఆదివారం 31 ఆగష్టు 2025 | epaper.manasakshi.in | వెల: రూ. 1.00



# బీసీలకు 42% అమలుకు జీవో

- బీసీలకు రిజర్వేషన్లపై ఆర్డినెన్స్ స్థానంలో నేడు శాసనసభలో బిల్లు
- గవర్నర్ కోటా ఎమ్మెల్సీలుగా కోదండరాం, అజహరుద్దీన్
- వరద నష్టంపై సమగ్ర అంచనాలతో నివేదికకు ఆదేశాలు
- గోశాల విధానానికి ఆమోదం
- మంత్రిమండలి నిర్ణయాలు



"కామారెడ్డి, మెదక్ జిల్లాల్లో వర్షాలతో పంట, ఆస్తి నష్టంతో పాటు రహదారులు పెద్దఎత్తున దెబ్బతిన్నాయి. పలువురు ప్రాణాలు కోల్పోయారు. వరద నష్టాన్ని అంచనా వేసి పూర్తి వివరాలతో రావాలని అధికారులకు చెప్పాం. నివేదిక వచ్చాక నష్ట అంచనాలపై సెప్టెంబరు 4న సీఎం అధ్యక్షతన ఉన్నతాధికారుల సమావేశం నిర్వహించి ప్రజలకు న్యాయం చేయాలని నిర్ణయించాం.





గవర్నర్ కోటా ఎమ్మెల్సీల కింద కోదండరాం, అజహరుద్దీన్‌లను ఎంపిక చేయాలని మంత్రిమండలి నిర్ణయించింది. గతంలో సిఫార్సు చేసిన ఆమెర్ అలీఖాన్ స్థానంలో అజహర్‌కు అవకాశం ఇస్తున్నాం.

"బీసీలకు 42% రిజర్వేషన్లు అమలు చేయాలని ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తోంది. కేసీఆర్ 2018లో తెచ్చిన చట్టం ఉరితాడుగా మారింది. ఇటీవల డిప్యూటీ సీఎం ఆధ%రి%్వర్యంలో సబ్‌కమిటీ న్యాయ కోవిదులతో చర్చించింది. దీనికి అనుగుణంగా 42% రిజర్వేషన్లతో స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని మంత్రిమండలి నిర్ణయం తీసుకుంది. ఎస్సీ, ఎస్టీ జనాభా ప్రాతిపదికన రిజర్వేషన్లు ఉంటాయి"



2లో..

# యూరియా కొరతపై బిఆర్ఎస్ ఆందోళన

- కమిషనర్‌కు వినతి పత్రం సమర్పణ
- సచివాలయం ముందు ఆకస్మిక ధర్నా
- కెటిఆర్, హరీష్ తదితరులను




ఏ రాష్ట్రాల్లోనూ యూరియా సమస్య లేదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం వైఫల్యం వల్లే.. తెలంగాణలో కొరత ఏర్పడిందని చెప్పారు. గత ప్రభుత్వంలో కరోనా సమయంలోనూ ఇబ్బంది లేకుండా పంపిణీ చేసినట్లు వివరించారు. భాజపా, కాంగ్రెస్ ఒకరిపై ఒకరు నెపం వేసుకొని తప్పించుకుంటున్నారని దుయ్యబట్టారు. యూరియా పంపిణీ చేతకాకపోతే తప్పుకోవాలన్నారు.

2లో..

గత ప్రభుత్వంలో లేని పీపీటీ సంప్రదాయం..

## ఇప్పుడెందుకు?



**హైదరాబాద్:,మనసాక్షి:** ప్రతిపక్షాలకు అసెంబ్లీలో పవర్ పాయింట్ ప్రజంటేషన్(పీపీటీ) ఇచ్చే సంప్రదాయం లేదని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క తెలిపారు. భారత రాష్ట్ర సమితి హయాంలో తాము పీపీటీకి అవకాశం ఇవ్వాలని లేఖ ఇచ్చినట్లు గుర్తుచేశారు. అప్పుడు తమకు ఎందుకు అవకాశం ఇవ్వలేదని ప్రశ్నించారు. అప్పుడు లేని సంప్రదాయం ఇప్పుడు ఎలా ఉంటుందన్నారు. ప్రభుత్వం రూ. 6,500 కోట్ల వడ్డీ కట్టట్లేదనే భారత రాష్ట్ర సమితి వాదన సరికాదని పేర్కొన్నారు. మరి వడ్డీలు ఆ పార్టీ నేతలు కడుతున్నారా అని ప్రశ్నించారు. మరోవైపు శాసనసభలో కాళేశ్వరంపై పీపీటీకి అవకాశం ఇవ్వాలని భారత రాష్ట్ర సమితి నేతలు డిమాండ్ చేస్తున్నారు.

# స్థానిక సంస్థల ఎన్నికలకు ముహూర్తం ఖరారు..

## గవర్నర్ కోటాలో ఎమ్మెల్సీగా అజారుద్దీన్..



**హైదరాబాద్:,మనసాక్షి:** కేబినెట్ పలు కీలక నిర్ణయాలు తీసుకుంది. సెప్టెంబర్‌లో స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించేందుకు కేబినెట్ ఆమోదం తెలిపింది. ఈ మేరకు ఎన్నికల కమిషన్‌కు తెలంగాణ ప్రభుత్వం లేఖ రాసింది. బీసీ రిజర్వేషన్ల విషయంలో సంచలన నిర్ణయం తీసుకుంది. తెలంగాణలో అమలు అవుతున్న సీలింగ్ రిజర్వేషన్ కోటాను ఎత్తివేస్తూ నిర్ణయం తీసుకుంది. దీంతో పాటు గవర్నర్ కోటాలో ఎమ్మెల్సీ అభ్యర్థిగా అజారుద్దీన్ పేరును ఖరారు చేసింది. అమీర్ అలీఖాన్ స్థానంలో అజారుద్దీన్‌ను ఎంపిక చేశారు.

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధ్యక్షతన జరిగిన తెలంగాణ కేబినెట్ సమావేశంలో పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. ఈ సమావేశానికి ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, సీఎస్ రామకృష్ణరావు, పలువురు మంత్రులు హాజరయ్యారు. ఈ సమావేశంలో ప్రథమంగా రాష్ట్రంలోని స్థానిక సంస్థల ఎన్నికల అంశంపై చర్చ జరిగింది. కేబినెట్ ఆమోదంతో సెప్టెంబర్ నెలలోనే ఎన్నికలు జరపాలని తేల్చి.. ఈ మేరకు రాష్ట్ర ఎన్నికల సంఘానికి అధికారిక లేఖ పంపాలని నిర్ణయించారు. తదుపరి అంశంగా పంచాయతీరాజ్ చట్టం-2018లోని సెక్షన్ 285లో మార్పులు చేర్పులు చేయాలని కేబినెట్ తేల్చింది. భౌగోళిక పరిస్థితులు, సామాజిక ఆర్థిక వెనుకబాటు, రాజకీయ సమీకరణాలను దృష్టిలో ఉంచుకుని, రిజర్వేషన్ పరిమితిని 50 శాతం సీలింగ్ వద్ద నిలిపే అవసరం లేదని అభిప్రాయం వ్యక్తమైంది. ఈ నేపథ్యంలో అసాధారణ పరిస్థితులు ఏర్పడితే.. సంబంధిత ప్రాంతాల్లో ఆ పరిమితిని అధిగమించేలా బిల్లును అసెంబ్లీలో ప్రవేశపెట్టాలని నిర్ణయించారు. ఈ నేపథ్యంలో బీసీ వర్గాలకు అధిక ప్రాతినిధ్యం కల్పించే ఉద్దేశంతో ప్రత్యేక జీవో తీసుకురావాలని కూడా కేబినెట్ ఆమోదించింది

. కొత్త జీవో ప్రకారం విద్య, ఉపాధి, ఉద్యోగ

రంగాలతో

పాటు స్థానిక సంస్థలలోనూ బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించబడతాయి. ఈ నిర్ణయం అమల్లోకి వస్తే.. సామాజిక న్యాయం బలోపేతం కావడమే కాకుండా వెనుకబడిన వర్గాల అభివృద్ధి మరింత వేగవంతం అవుతుంది.

గవర్నర్ కోటాలో ఎమ్మెల్సీగా..

గవర్నర్ కోటా ఎమ్మెల్సీ స్థానాల విషయంలోనూ కేబినెట్ కీలకమైన నిర్ణయాలు తీసుకుంది.




2లో..

# గోదావరికి పోటెత్తిన వరద

నీట మునిగిన బాసర

వీధులుగోదావరికి పోటెత్తిన వరద

నీట మునిగిన బాసర వీధులు




2లో..

# పేదల కోసం తపించిన మహానేత సురవరం

ఆయన ఆశయాలు కొనసాగించేందకు కృషి

సురవరం సంస్మరణ సభలో సిఎం రేంవత్ రెడ్డి

కార్మికుల సమస్యల పరిష్కారం కోసం సురవరం సుధాకర్‌రెడ్డి పనిచేశారని విశ్రాంత సీజేఐ జస్టిస్ ఎన్వీ రమణ అన్నారు. వారి ఇబ్బందులపై పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ సభ్యుడిగా నివేదికలు ఇచ్చారని గుర్తుచేశారు. జిల్లా, రాష్ట్ర స్థాయిలో విద్యార్థులతో కలిసి ఉద్యమాలు చేపట్టారని తెలిపారు. తనకు కూడా వామపక్ష భావజాలం పట్ల అభిమానం ఉందని పేర్కొన్నారు. సురవరం ఆదర్శప్రాయమైన జీవితాన్ని గడిపారని కొనియాడారు.



2లో..

# యూరియా కొరతపై బిఆర్ఎస్ డ్రామాలు

వీరి రాజకీయాలను ప్రజలు గమనిస్తున్నారు

మండిపడ్డ వ్యవసాయ మంత్రి తుమ్మల

# గోదావరికి పోటెత్తిన వరద

## నీట మునిగిన బాసర వీధులు




ఆదిలాబాద్:నిర్మల్ జిల్లా బాసర వద్ద గోదావరి నది ఉధృతంగా ప్రవహిస్తోంది. రెండు రోజులుగా వరద పెరగడంతో గోదావరి నుంచి సరస్వతి ఆలయం వరకు ప్రధాన రహదారి జలమయమైంది. వరదనీరు వ్యాసమహర్షి ఆలయానికి, ఆలయ ఆవరణలోని తితిదే గృహాల వరకు చేరుకుంది. ఆలయం వద్ద దుకాణాలు, ప్రైవేటు- లాడ్జ్‌లు, సత్రాలన్నీ నీట మునిగాయి. దీంతో సరుకులు మొత్తం నీటిలో కొట్టుకు పోయాయని దుకాణదారులు విలపించారు. గంగాదేవి, సూర్యేశ్వర శివాలయం, అక్షర కాలనీ, ఎస్‌బీఐ, యూనియన్ బ్యాంక్‌లు జలమయమయ్యాయి. అక్షర కాలనీలో చిక్కుకున్నవారిని ట్రాక్టర్ల సహాయంతో
సురక్షిత ప్రాంతాలకు తరలించారు. స్థానిక నాగభూషణ్ విద్యాలయంలో 30 మంది విద్యార్థులు, ఆరుగురు టీ- చర్లు చిక్కుకున్నారు. వరద చుట్టు-ముట్టడంతో భవనం పై అంతస్తుకు వెళ్లి తలదాచుకున్నారు. వారిని బయటకు తీసుకొచ్చేందుకు వెళ్లి మరో 8 మంది కూడా వరదనీటిలో చిక్కుకున్నారు.

# యూరియా కొరతపై బిఆర్ఎస్ డ్రామాలు

హైదరాబాద్: రాష్ట్రంలో యూరియా కొరత ఉందంటూ ప్రతిపక్ష బీఆర్ఎస్ పార్టీ చేసిన ఆందోళనపై రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు ఫైర్ అయ్యారు. యూరియా కొరతకు కేంద్ర ప్రభుత్వం కారణమని మీకు తెలియదా అంటూ ప్రశ్నించారు. కేంద్రం వల్ల యూరియా కొరత ఉంటే మాపై విమర్శలు చేస్తారా అని బీఆర్ఎస్ నేతలపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇదంతా కావాలని చేస్తున్న డ్రామాగా ఆయన అభివర్ణించారు. రేవంత్ సర్కార్‌ను బద్నాం చేసేందుకే బీఆర్ఎస్ దిగజారుడు రాజకీయం చేస్తోందని విమర్శించారు. యూరియా సప్లైపై నిర్లక్ష్యంపై కేంద్ర ప్రభుత్వాన్ని బీఆర్ఎస్ ఎందుకు ప్రశ్నించడం లేదన్నారు. యూరియాపై బీఆర్ఎస్ నేతలది కపట నాటకమని.. బీఆర్ఎస్ నాటకాలను రైతులు నమ్మరని అన్నారు. అనవసరంగా రైతులను రెచ్చగొడుతున్నారని విమర్శించారు. రాష్ట్రంలో యూరియా సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ శనివారంబీఆర్ఎస్ నేతలు ఆందోళనకు దిగారు. ముందుగా వ్యవసాయ శాఖ కమిషనర్ కార్యాలయం ముందు ఆందోళనకు దిగిన బీఆర్ఎస్ నేతలు.. యూరియా సమస్యను పరిష్కరించాలని వ్యవసాయ శాఖ కమిషనర్‌కు వినతిపత్రం ఇచ్చారు. అనంతరం తెలంగాణ సచివాలయం ముందు బైఠాయించి ఆందోళన చేశారు. ఈ ధర్నాలో హరీష్ రావు, కేటీ-ఆర్, తదితరులు పాల్గొన్నారు. బీఆర్ఎస్ నేతలను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. బీఆర్ఎస్ ఆందోళనతో సచివాలయం దగ్గర కాసేపు ఉద్రిక్తత నెలకొంది. దీనిపై మంత్రి తుమ్మల తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. బిజెపికి అనుకూలంగా బిఆర్ఎస్ కావాలనే ఆందోళన చేస్తోందన్నారు. ఎరువులు సరఫరా చేయని కేంద్రాన్ని నిలదీయకుండా గతంలో తాము అంతా గొప్పలు చేశామని చెప్పుకోవడం సిగ్గుచేటని అన్నారు.

# ప్రజా సమస్యల కోసం నిరంతర పోరాటం




హైదరాబాద్: కార్మికుల సమస్యల పరిష్కారం కోసం సురవరం సుధాకర్‌రెడ్డి పనిచేశారని విశ్రాంత సీజేఐ జస్టిస్ ఎన్వీ రమణ అన్నారు. వారి ఇబ్బందులపై పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ- సభ్యుడిగా నివేదికలు ఇచ్చారని గుర్తుచేశారు. జిల్లా, రాష్ట్ర స్థాయిలో విద్యార్థులతో కలిసి
ఉద్యమాలు చేపట్టారని తెలిపారు. తనకు కూడా వామపక్ష భావజాలం పట్ల అభిమానం ఉందని పేర్కొన్నారు. సురవరం ఆదర్శప్రాయమైన జీవితాన్ని గడిపారని కొనియాడారు. రవీంద్రభారతిలో దివంగత సీపీఐ మాజీ జాతీయ ప్రధాన కార్యదర్శి, మాజీ ఎంపీ సురవరం సుధాకర్‌రెడ్డి సంస్మరణ సభ నిర్వహించారు. సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అధ్యక్షతన ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు- చేశారు. సీపీఐ జాతీయ ప్రధాన కార్యదర్శి డి.రాజా, సీపీఎం పొలిట్‌బ్యూరో సభ్యుడు బీవీ రాఘవులు, తమ్మినేని వీరభద్రం, సీపీఐ ఏపీ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ, ప్రొఫెసర్ హరగోపాల్, గుమ్మడి నర్సయ్య పాల్గొన్నారు. దశాబ్దానికిపైగా సురవరం, తాను కలిసి కమ్యూనిస్టు ఉద్యమాన్ని ముందుకు తీసుకెళ్లినట్లు- బీవీ రాఘవులు తెలిపారు. అనేక పోరాటాలు, ఉద్యమాల్లో కలిసి పని చేసినట్లు- వివరించారు. సురవరం గొప్ప ప్రజాస్వామిక వాది అని కొనియాడారు. ఆయన లేని లోటు- పూడ్చలేనిదని పేర్కొన్నారు. సురవరం సుధాకర్ రెడ్డి ఆశయాలను ముందుకు తీసుకెళ్లేందుకు కమ్యూనిస్టులు ఐక్యంగా ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. తాను ఎన్ఎస్‌యూఐ నాయకుడిగా ఉన్నప్పుడు తొలిసారి సురవరం సుధాకర్‌రెడ్డిని కలిసినట్లు- టీపీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్ గౌడ్ తెలిపారు. ఇటీవల సీపీఐ రాష్ట్ర కార్యాలయం ప్రారంభోత్సవంలో మళ్లీ కలిసినట్లు- చెప్పారు. కమ్యూనిజం ఎప్పుడూ సజీవంగా ఉంటుందన్నారు. సురవరం నిబద్ధతతో రాజకీయాలు నడిపారన్నారు. ఆయన జీవితం ఎంతో మందికి ఆదర్శమని పేర్కొన్నారు.

# తెలంగాణ కేబినెట్ సంచలన నిర్ణయం

హైదరాబాద్: తెలంగాణ కేబినెట్ సంచలన నిర్ణయం తీసుకుంది. రిజర్వేషన్ల పరిమితిని ఎత్తివేయాలని నిర్ణయించింది. పంచాయతీ రాజ్ చట్టం2018 సవరణకు ఆమోదం తెలిపిన కేబినెట్.. రిజర్వేషన్ల పరిమితిపై గత ప్రభుత్వం తెచ్చిన ఆర్డినెన్స్ స్థానంలో ఈ అసెంబ్లీలో ప్రత్యేక బిల్లు ప్రవేశ పెట్టాలని నిర్ణయించింది. అసెంబ్లీ తర్వాత ప్రత్యేక జీవో తెచ్చి కులగణన ఆధారంగా తెలంగాణలో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలని చూస్తోంది. మొత్తానికి స్థానిక సంస్థల ఎన్నికలు ఎప్పుడు జరుగుతాయనే దానికి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం తెర దింపింది. తాజాగా స్థానిక సంస్థల ఎన్నికలకు రాష్ట్ర మంత్రివర్గం ఆమోదం తెలిపింది. సెప్టెంబర్‌లో స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని నిర్ణయం తీసుకుంది. ఈ క్రమంలో ఎన్నికల కమిషన్‌కు తెలంగాణ ప్రభుత్వం లేఖ రాసింది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలో శనివారం భేటీ- అయిన తెలంగాణ కేబినెట్ పలు కీలక నిర్ణయాలు చేసింది. స్థానిక ఎన్నికల రిజర్వేషన్లలో పరిమితి ఎత్తివేయాలని కూడా కేబినెట్ నిర్ణయించింది. గవర్నర్ కోటా ఎమ్మెల్సీలుగా అజారుద్దీన్, కోదండరాం పేర్లను గవర్నర్‌కు క్యాబినెట్ సిఫార్సు చేసింది. అసెంబ్లీ కమిటీ- హాలులో జరిగిన ఈ మంత్రివర్గ సమావేశంలో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల అంశంతోపాటు-, ఇటీ-వలి వర్షాలు, వరదలతో నష్టపోయిన రైతులను ఆదుకోవడంపైనా చర్చించారు. పంటలు, రోడ్లు, ఇతర నష్టాలపై కేంద్ర ఆర్థికశాఖ సాయం కోరుతూ తీర్మానం చేశారు. కేబినేట్ వివరాలను మంత్రి పొంగులేటి మీడియాకు వివరించారు. మరోవైపు సెప్టెంబర్ 30లోగా స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని ఇప్పటికే హైకోర్టు స్పష్టం చేసిన నేపథ్యంలో ఎన్నికల నిర్వహణకు సంబంధించి కూడా క్యేబినెట్ నిర్ణయం తీసుకుందని అన్నారు. తెలంగాణలో స్థానిక సంస్థల ఎన్నికలు సెప్టెంబర్‌లోగా జరపాలని కోర్టు ఆదేశించింది. మొత్తం రిజర్వేషన్ల పరిమితి 50 శాతానికి మించకూడదని గత ప్రభుత్వం 2018 ఆర్డినెన్స్ తీసుకొచ్చింది. దీనిపై ప్రస్తుత తెలంగాణ ప్రభుత్వం ఆర్డినెన్స్ చేసి గవర్నర్ కు పంపింది. ప్రస్తుతం బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల బిల్లు రాష్ట్రపతి దగ్గర పెండింగ్ లో ఉందన్నారు. ముస్లీం కోటా పేరుతో బీజేపీ బిల్లును అడ్డుకుంటోంది. రాష్ట్రపతి ఆమోదం తెలపకుండా ప్రధాని మోదీ సర్కార్ అడ్డుకుంటోంది. కేంద్ర ప్రభుత్వ తీరుకు నిరసనగా 42 శాతం రిజర్వేషన్లకు ఆమోదం తెలపాలని ఢిల్లీలో
నిరసన కూడా తెలిపినట్లు వెల్లడంచారు. గవర్నర్ కోటాలో ఎమ్మెల్సీ లుగా కోదండరాం, అజారుద్దీన్ పేర్లను సిఫారసు చేస్తూ తెలంగాణ కేబినెట్ ఆమోదం తెలిపింది. సుప్రీంకోర్టు తీర్పుతో కేబినెట్ మరోసారి గవర్నర్ కోటా ఎమ్మెల్సీల పేర్లను సిఫారసు చేసింది. అయితే కోదండరాం పేరుతో పాటు- ఈ సారి అమీర్ అలీ ఖాన్ స్థానంలో అజారుద్దీన్ కు స్థానం కల్పించాలని నిర్ణయించారు. ఎమ్మెల్సీలుగా కోదండరాం, ఆమిర్ అలీఖాన్ నియామకాన్ని సవాల్ చేస్తూ బీఆర్ఎస్ నేతలు దాసోజు శ్రవణ్, కుర్ర సత్యనారాయణ 2024 ఆగస్టులో సుప్రీంకోర్టులో సివిల్ అప్లికేషన్ దాఖలు చేసిన సంగతి తెలిసిందే. ఈ పిటిషన్ ను విచారించిన సుప్రీం కోర్టు.. గవర్నర్ కోటా ఎమ్మెల్సీల నియామకంలో ప్రొఫెసర్ కోదండరాం, ఆమిర్ అలీ ఖాన్ కేసు విషయంలో 2025 ఆగస్టు 13 న స్టే విధించింది. 2024 ఆగస్టు 14న తాము ఇచ్చిన మధ్యంతర ఉత్తర్వుల తర్వాత జరిగిన పరిణామాలు ఆ ఉత్తర్వులకు వ్యతిరేకంగా ఉంటే ఎమ్మెల్సీల నియామకాన్ని రద్దు చేస్తామని వ్యాఖ్యానించింది.

# యూరియా కొరతపై బిఆర్ఎస్ ఆందోళన



హైదరాబాద్:రైతు సమస్యలు, పంట నష్టం, యూరియా కొరతపై వ్యవసాయ శాఖ కమిషనర్‌కు భారత రాష్ట్ర సమితి నేతలు వినతి పత్రం అందజేశారు. అనంతరం కార్యాలయం వద్ద నిరసన చేపట్టారు. అన్నదాతల సమస్యలను పరిష్కరించాలని బైఠాయించారు. దీంతో కేటీఆర్, హరీశ్‌రావు, నిరంజన్‌రెడ్డితో పాటు పార్టీ ఎమ్మెల్సీలు, నేతలను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అంతకుముందు హరీశ్‌రావు మాట్లాడుతూ.. ఏ రాష్ట్రంలోనూ యూరియా సమస్య లేదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం వైఫల్యం వల్లే.. తెలంగాణలో కొరత ఏర్పడిందని చెప్పారు. గత ప్రభుత్వంలో కరోనా సమయంలోనూ ఇబ్బంది లేకుండా పంపిణీ చేసినట్లు- వివరించారు. భాజపా, కాంగ్రెస్ ఒకరిపై ఒకరు నెపం వేసుకొని తప్పించు కుంటున్నారని దుయ్యబట్టారు. యూరియా పంపిణీ చేతకాకపోతే తప్పుకోవాలన్నారు. తాము రాజకీయాల కోసం రాలేదని.. రైతుల కోసం వచ్చినట్లు- పేర్కొన్నారు. యూరియా కోసం వెళ్తే రైతులపై దాడి చేస్తున్నారని నిరంజన్‌రెడ్డి విమర్శించారు. కొరత సమస్యపై ఒక్కరోజైనా సమీక్ష చేశారా అని ప్రశ్నించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి అన్నదాతలకు కష్టాలు మొదలైన సంగతి తెలిసిందే. నాటి నుంచి నేటి వరకు రైతులకు అండగా నిలుస్తూ.. వారి పక్షాన బీఆర్ఎస్ నేతలు పోరాడుతూనే ఉన్నారు. గత కొద్ది రోజుల నుంచి యూరియా కొరతపై రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. రైతుల కష్టాలపై బీఆర్ఎస్ నేతలు స్పందిస్తూనే ఉన్నారు. ఇవాళ కూడా వ్యవసాయ శాఖ కమిషనర్‌కు యూరియా కొరతను తక్షణమే తీర్చాలంటూ రైతుల తరఫున బీఆర్ఎస్ నేతలు వినతిపత్రం సమర్పించామని అన్నారు.
ఆ తర్వాత ఎమ్మెల్యే హరీశ్‌రావు నేతృత్వంలో బీఆర్ఎస్ నాయకులు తెలంగాణ సచివాలయాన్ని ముట్టడించారు. సచివాలయం ప్రధాన గేటు- వద్ద బైఠాయించారు. యూరియా కొరత తీర్చాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ క్రమంలో సచివాలయం వద్ద పటిష్ట బందోబస్తు ఏర్పాటు- చేశారు. యూరియా సంక్షోభానికి కారణం కాంగ్రెస్ పార్టీ అంటూ నినాదాలు చేశారు. పండగపూట కూడా రైతన్నలను రోడ్లపై నిలబెట్టింది ఈ ప్రభుత్వం అని ధ్వజమెత్తారు. గణపతి బప్పా మోరియా - కావాలయ్యా యూరియా అంటూ నినదించారు. రైతన్నలకు ఎరువులు సరఫరా చేయలేని కాంగ్రెస్ ప్రభుత్వం వెంటనే దిగిపోవాలని నినాదాలు చేశారు. రైతన్నలకు యూరియా వెంటనే సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. రేవంత్ దోషం - రైతన్నకు మోసం అంటూ నినాదాలు చేశారు బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు.

# బీసీలకు 42 శాతం అమలుకు జీవో

హైదరాబాద్: తెలంగాణ శాసనసభ, మండలి సమావేశాలు ప్రారంభమయ్యాయి. నాలుగైదు రోజుల పాటు ఈ సమావేశాలు నిర్వహించే అవకాశాలున్నాయి. నూతనంగా ఎన్నికై- శాసనమండలి సభ్యులను మండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి సభకు పరిచయం చేశారు. అలాగే ఇటీవల మృతిచెందిన మండలి మాజీ సభ్యులు మాగం రంగారెడ్డి, రత్ఆకర్‌లకు సభ నివాళి అర్పించిన అనంతరం సోమవారానికి వాయిదే పడింది. అసెంబ్లీలో మరోవైపు ఇటీవల మృతి చెందిన జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ మృతికి సబ సంతాపం ప్రకటించింది. గోపీనాథ్ మృతిపట్ల సీఎం రేవంత్‌రెడ్డి శాసనసభలో సంతాప తీర్మానం ప్రవేశపెట్టారు. విద్యార్థి రాజకీయాల్లో గోపీనాథ్ చురుగ్గా ఉండేవారని ఈ సందర్భంగా రేవంత్‌రెడ్డి గుర్తు చేసుకున్నారు. 1985 నుంచి 1992 వరకు తెలుగు యువత అధ్యక్షుడిగా పని చేశారని, ఎన్టీఆర్‌కు విశ్వాసపాత్రుడిగా గోపీనాథ్‌కు సత్సంబంధాలు ఉండేవన్నారు. విద్యార్థి నేతగా , ప్రజాప్రతినిధిగా, సినీ నిర్మాతగా రాణించారని చెప్పారు. గోపీనాథ్



తనకు మంచి మిత్రుడని, సన్నిహితుడని గుర్తు చేసుకున్నారు. గోపీనాథ్ తనకు చిన్ననాటి నుంచే మిత్రుడని పేర్కొన్నారు. ఆయన మృతి తనను వ్యక్తిగతంగా తీవ్రంగా కలిచివేసిందని గోపీనాథ్ కుటుంబానికి తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. సంతాప తీర్మానం ప్రవేశపెట్టిన సందర్భంగా సీఎం రేవంత్ మాగంటి గోపీనాథ్ జీవన ప్రయాణాన్ని గుర్తు చేసుకున్నారు. రాజకీయంగా పార్టీలు వేరైనా.. వ్యక్తిగతంగా నాకు మంచి మిత్రుడని తెలిపారు. ఆయన విద్యార్థి దశ నుంచే రాజకీయాల్లో చురుకుగా ఉన్నారని అన్నారు. 1983లో ఎన్టీఆర్ స్థాపించిన తెలుగుదేశం పార్టీలో ఆయన తన రాజకీయ ప్రస్థానాన్ని ప్రారంభించారని.. 1985 నుండి 1992 వరకు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి తెలుగు యువత అధ్యక్షుడిగా సేవలందించారని తెలిపారు. 1987-88 లో హైదరాబాద్ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ- డైరెక్టర్‌గా 1988-93లో జిల్లా వినియోగదారుల ఫోరం సభ్యుడిగా విశేష కృషి చేశారు. గోపీ ఎన్టీఆర్‌కు గొప్ప భక్తుడు. సినీరంగంలోనూ నిర్మాతగా రాణించారు. వరసగా మూడు సార్లు
ఎమ్మెల్యేగా ఎన్ని-కై- ఘనత సాధించిన వారిలో మాగంటి గోపీనాథ్ ఒకరని అసెంబ్లీలో సీఎం రేవంత్ తెలియజేశారు. చూడటానికి ఆయన క్లాస్ గా కనిపించినా జూబ్లీహిల్స్ నియోజకవర్గానికి ఆయన మాస్ లీడర్ అని అన్నారు. గోపీనాథ్ అకాల మరణం వారి కుటుంబానికి తీరని శోకాన్ని మిగిల్చిందని.. ఆయన ఆత్మకు శాంతి కలగాలని భగవంతుణ్ని ప్రార్థిస్తున్నట్లు- పేర్కొన్నారు. మంత్రులు శ్రీధర్ బాబు, పొన్నం ప్రభాకర్‌లు మాట్లాడుతూ గోపీనాథ్‌తో ఉన్న అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు. గోపీనాథ్‌తో తనకు చిరకాల మిత్రుత్వం ఉందని శ్రీధర్ బాబు అన్నారు. తరవాత కెటిఆర్, ఇతర సభ్యులుఉమాట్లాడుతూ గోపీనాథ్ మృతికి సంతాపం ప్రకటించారు. అనంతరం సభ సోమవారానికి వాయిదా పడింది.

# ప్రకృతి విధ్వంసానికి పరాకాష్ట !

ప్రకృతి విధ్వంసంపై ప్రజల్లో చైతన్యం కానరావడం లేదు. మన చేజేతులా ప్రకృతిని నాశనం చేస్తున్నాం. ఫలితం అనుభవిస్తున్నాం. మనం జీవించి ఉండగానే ఎన్నో విపత్తులను చూస్తున్నాం. ఎక్కడిక్కడ చెరువుల విధ్వంసం, ఆక్రమణలతో ఇప్పుడు ఇళ్లలోకి వరదనీరు వచ్చి చేరుతోంది. ఎందుకిలా జరిగిందో, జరుగుతుందో ఆలోచించడం లేదు. ఇల్లూవాకిలీ, పొలంగట్రా నీట మునిగాక ప్రభుత్వాలను నిందిస్తూ సాయం కోసం ఆశగా ఎదురుచూస్తున్నాం. ప్రతి గ్రామంలో వందల ఏళ్ల క్రిం ఉన్న చెరువులును గుట్టలను, వాగులను వంకలను మాయం చేస్తున్నాం. మనకు లాభం జరిగిందా లేదా అన్న కోణంలోనే ఆలోచన చేస్తున్నాం. అదుకే ప్రకృతి ప్రకోపించి మన ఇళ్లనే మనముందే ముంచేస్తోంది. అందుకు తాజా వర్షాలే నిదర్శనం. చెరువుఉల, వంకలు, వాగులు అలాగే ఉండివుంటే వచ్చిన నీరు వచ్చినట్లు మళ్లీ పోయేది. దానికి దారిలేకుండా చేసిన పాపానికి మనం ఫలితం అనుభవిం చాల్సిందే. తెలుగు రాష్ట్రాలతో పాటు ఉత్తరాది రాష్ట్రాలు జలప్రళయంతో విలవిల్లాడుతున్నాయి. నిజామాబాద్, మెదక్, కామారెడ్డి, నిర్మల్, ఆదిలాబాద్ జిల్లాల్లో వరదలకు ప్రకృతి విధ్వంసం కారణమని గుర్తించాలి. ఇకపోతే క్లౌడ్ బరస్ట్‌తో కుంభవృష్టి కురుస్తోంది. ఉత్తరాదిలోని ఉత్తరాఖండ్ లోని రుద్రప్రయాగ్, చమోలీ జిల్లాల్లో కుంభవృష్టి అనేక గ్రామాలను ముంచెత్తుతోంది. ఉత్తరాఖండ్‌లో తాజాగా మరోసారి క్లౌడ్‌బర్స్ సభవించింది. అనేక చోట్ల ఇళ్లుకూలి అనేకమంది ప్రాణాలు కోల్పోయారు. హిమాచల్‌ప్రదేశ్, జమ్మూకశ్మీర్ రాష్ట్రాల్లో అనేక జిల్లాలకు సంబంధాలు తెగిపోయాయి. జమ్మూకశ్మీర్‌లో ఇప్పటివరకు 40 మంది ప్రాణాలు కోల్పోయారు. శ్రీనగర్, అనంత్‌నాగ్‌ల్లో నదులు ప్రమాదస్థాయిని మించి ఉప్పొంగడంతో, గండ్లుపడి లోతట్టు



ప్రాంతాలు జలమయమయ్యాయి. పంజాబ్‌లో గ్రామాలన్నీ జలదిగ్బం ధంలో చిక్కుకున్నాయి. వ్యవసాయ భూములు అదృశ్యమయ్యాయి. దేశ రాజధాని ఢిల్లీలో కూడా భారీ వర్షపాతం నమోదైంది. యమునా నది ఉప్పొంగి ప్రవహిస్తోంది. నైరుతి పవనాల ప్రభావం తీవ్రంగా ఉంటోంది. ఈ ఆగస్టులో ఎప్పుడూ లేనంతగా క్లౌడ్ బరస్ట్ కారణంగా భారీ వర్షాలు ప్రారంభమయ్యాయి. హిమాలయ పర్వత వాలు ప్రాంతాలు ఒరిగిపోయాయి. మైదానప్రాంతాల్లో గట్లు దెబ్బతిన్నాయి. లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. పంటపొలాలు నీట మునిగాయి. రైతన్నలు పూర్తిగా రోడ్డున పడ్డారు. తక్కువ సమయాల్లో ఎడతెరిపిలేని కుంభవృష్టి స్థానిక నేలకోతను పెంచుతుంది. కొండచరియలు విరిగిపడి సమీప నివాసాలను ధ్వంసం చేస్తున్నాయి. ఊళ్లకు ఊళ్లే కొట్టుకు పోతున్నాయి. పదుల సంఖ్యలో జనం మృత్యువాత పడుతున్నారు. ఒఇలా ఎందుకు జరుగుతుందో ప్రజలు ఆలోచించాలి. ప్రభుత్వాలు చర్చించాలి. కార్యాచరణకు దిగాలి. ప్రకృతి వైపరీత్యాల నుంచి అనుభవాలు నేర్చుకోవడం లేదు. మనం చేస్తున్న విధ్వంసం గురించి మాట్లాడకుండా, వాటిని విస్మరించి ప్రకృతి విపత్తును అసాధారణమైనదిగా చర్చిస్తున్నాం. కొండచరియలు విరిగి పడడానికి కూడా మనం చెట్లను తొలగించడం, బండలను పగుల గొట్టడం అని తెలుసుకోవడం లేదు. దేశంలోని 16 రాష్ట్రాలు, హిమాలయ రీజియన్ లోని రెండు కేంద్ర పాలిత ప్రాంతాలు, ఈశాన్యంలోని హిమాలయ పర్వత దిగువ భాగాలు, పశ్చిమ కనుమలు ఇవన్నీ కొండచరియలు విరిగిపడే ప్రాంతాలుగా జియోలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా అధ్యయనంలో గుర్తించింది.
రోడ్లు, రైల్వే ప్రాజెక్టుల నిర్మాణాలు, ఎలాంటి ప్రణాళిక లేకుండా సాగించే కొండ క్వారీ పనుల కారణంగా కొండచరియలు విరిగిపడడానికి కారణమవుతున్నాయని హెచ్చరించింది. హిమాలయ పర్వత ప్రాంతాల్లో ఇష్టం వచ్చినట్లుగా చెట్లను కూల్చివేశారు. దీంతో కొండలపై ఉన్న సారవంతమైన మట్టి వర్షాలకు కొట్టుకుపోయి, కొండచరియలు విరిగిపడుతున్నాయి. దీంతోపాటు- పంట పొలాల్లోకి, ఇళ్లలోకి బురద ప్రవాహంలా వచ్చిచేరుతోంది. ఎన్నో ప్రాణాలు జలసమాధి అవుతున్నాయి. ఇవన్నీ స్వయం కృతాపరాధాలే. పర్యావరణ సున్నితమైన హిమాలయ రాష్ట్రాల్లో కొండవాలు ప్రాంతాలు అత్యంత బలహీనమైనవని, వాటిని తిరిగి పొందలేమని పర్యావరణ శాస్త్రవేత్తలు ఎన్ని హెచ్చరికలు చేసినా పెడచెవిన పెడుతున్నాం. ప్రజలు, ప్రభుత్వం చేస్తున్న విధ్వంసంగా దీనిని గుర్తించాలి. ప్రభుత్వాలు ఈ విధ్వంసాన్ని అడ్డుకోవడం లేదు. అలాగని ప్రజలు కూడా తమ వైఖరి మార్చుకోవడం లేదు. అంతెందుకు మనదగ్గర పోడు వ్యవసాయంతో అడవులను నరికివేస్తున్నాం. దీనిని అడ్డుకుని అడవులను పెంచాల్సిన బాధ్యతలను విస్మరించి, పోడు రైతులను ప్రోత్సహిసతున్నారు. భారీ వర్షాల కారణంగా భూమి కోతకు గురికావడంతో ఆనకట్టల్లో పూడిక పేరుకుపోతోంది. వరదలతో దిగువ ప్రవాహాలు పెరుగుతున్నాయి. ప్రకృతి వైపరీత్యాలు అదే పనిగా సంభవిస్తున్నాయనడానికి ఇదంతా మానవ తప్పిదమని గుర్తించడం లేదు. అవసరాల కోసం అడవులను నరికివేస్తున్నారు. కొండవాలు ప్రాంతాలను తొలగించడం, పరీవాహక ప్రాంతం కుదించుకుపోవడం, జనాభా పెరిగిపోతుండడం వీటన్నిటి ఫలితం ఎంతటి విధ్వంసాన్ని కలిగిస్తుందో ప్రత్యక్షంగా చూస్తున్నాం. ఈ
అనుభవాలను దృష్టిలో పెట్టుకుని ఒక ప్రణాళికతో ప్రకృతి విధ్వంసాన్ని ఆపితే..కొంతయినా తగ్గించు కోవడం సాధ్యం కాగలదు. తరచుగా సంభవిస్తున్న ఈ విపత్తుల నివారణకు ముందస్తు ప్రణాళికలు ఆలోచించడం లేదు. ఇప్పటికీ సమయం మించిపోలేదు. దీనికంతటికీ కారణమైన పలు అంశాలను పరిగణనలోకి తీసుకోవాలి. చెట్లను నరకడం, గుట్ంటలను పిండిచేయడం, కొండవాలు ప్రాంతాలను ధ్వంసం చేసయడం, అడవులను నరకడం తక్షణం ఆపాలి. కాలువుల, చెరువులను పునరుద్దరించాలి.

# కాంగ్రెస్ ప్రభుత్వంలోనే పేదలకు ఇండ్లు రేషన్ కార్డులు

**పెన్ పహాడ్,ఆగష్టు 30,మన సాక్షి:**

కాంగ్రెస్ ప్రభుత్వంలోనే నిరుపేదలకు ఇండ్లు రేషన్ కార్డులు మంజూరు చేయడం జరిగిందని ఏఐసిసి సభ్యులు రామిరెడ్డి సర్వోత్తమ రెడ్డి . సూర్యాపేట వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కొప్పుల వేనారెడ్డి అన్నారు.ఇరువురు శనివారం మండలంలో లింగాల, ధూపహాడ్, న్యూ బంజర హిల్స్ తండా , జల్ మాల్కుంట తండా గూడెపుకుంట లో నూతనముగా మంజూరైన ఇందిరమ్మ ఇండ్లకు భూమి పూజ చేసి ఇరువురు మాట్లాడారు.గతము లో 10 సంవత్సరములు పరిపాలించిన బిఆర్ఎస్ ప్రభుత్వం ఏ ఒక్క నిరుపేదకు ఇండ్లు, రేషన్ కార్డులు ఇవ్వలేదని వారన్నారు, కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే ప్రజా పాలనలో దరఖాస్తు చేసుకున్న నిరుపేదలకు ఇండ్లు మంజూరు చేసి పట్టాలి ఇవ్వడం జరిగిందని వారన్నారు, 2018 నుండి ఏ ఒక్కరికి పెన్షన్లు మంజూరు చేయలేదని ఆన్లైన్ చేసుకునే అవకాశం లేకుండా బి. ఆర్. ఎస్ ప్రభుత్వం చేసిందని వారు దుయ్యబట్టారు.

రేషన్ కార్డు కలిగిన నిరుపేదలకు సన్న బియ్యం పంపిణీ చేసిన ఘనత కాంగ్రెస్ పార్టీ దేనని వారన్నారు, ఇందిరమ్మ రాజ్యంలో అర్హులైన పేదలకు అందరికీ అతి తొందరలోనే వితంతువులు, వికలాంగులు, చేనేత కార్మికులు, వృద్ధులు, ఒంటరి మహిళలకు, అర్హులైన ప్రతి ఒక్కరికి కాంగ్రెస్ ప్రభుత్వం త్వరలో నూతన పెన్షన్లు అందించబోతుందని వారన్నారు ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు తూముల సురేష్ రావు, మార్కెట్ కమిటీ డైరెక్టర్ అర్థికేశవులు, దామోదర్ రెడ్డి ,మాజీ జెడ్పిటిసి



పిన్నమనేని కోటేశ్వర రావు, నారాయణ ప్రవీణ్ రెడ్డి, గజ్జల సైదిరెడ్డి, అంజద్ అలీ, అభినవ్ , భూక్య శివ నాయక్, సందీప్ రాథోడ్, సముద్రాల రాంబాబు, గార్లపాటి స్వర్ణ, వెంకటరెడ్డి, జూకూరి గాంధీ, దొంగరి సైదులు, వెంకన్న ,ధారావత్తు రవీందర్, భూక్య జామా నాయక్, దాచేపల్లి భరత్, నకిరేకంటి వెంకన్న, పిన్నమనేని జనార్ధన్, దొంగరి గోపి, పెద్ద పోలు సునీల్, చింతమల్ల నవీన్, వివిధ గ్రామాల మాజీ సర్పంచులు ,కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, నాయకులు, ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులు, కార్యకర్తలు, పాల్గొన్నారు.

## పంట నష్టపోయిన రైతులను ఆదుకోవాలి

**నడిగూడెం,ఆగష్టు 30,మన సాక్షి:**



మండల పరిధిలోని రైతాంగానికి సరిపడా యూరియా సరఫరా లేకపోవడంతో పంటలను కాపాడుకునేందుకు రైతులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, కావున ఎటువంటి షరతుల్లేకుండా రైతులకు సరిపడా యూరియాను అందించాలని తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షుడు గుండు నాగేశ్వరరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం రైతు సమస్యలపై స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో డిప్యూటీ తహసీల్దార్ కు పార్టీ నాయకులతో కలిసి వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. డిమాండ్ కు తగిన సరఫరా లేని కారణంగా అధికారులు అనేక షరతులను విధించి ఆధార్ కార్డు కు రెండు యూరియా బస్తాలు ఇస్తున్నారని, ఇవి కూడా సమయానికి అందించడం లేదని విమర్శించారు. ఎటువంటి షరతుల్లేకుండా సాగు విస్తీర్ణానికి అనుగుణంగా సరఫరా చేసి రైతాంగాన్ని ఆదుకోవాలని కోరారు. అదే విధంగా ఇటీవల కురిసిన భారీ వర్షాల కారణంగా వందలాది ఎకరాల పంట నీట మునిగిపోయిందని, మరికొన్ని చోట్ల ఇసుక మేట వేసిందని వరదల వల్ల నష్టపోయిన రైతులకు నష్టపరిహారం అందించాలని డిమాండ్ చేశారు. మండల ప్రధాన కార్యదర్శి ఎస్ కె జహీర్, టిడిపి నాయకుల దేవరంగుల వీరన్న, నర్సయ్య, పిచ్చయ్య, గోవింద్, సైదులు, ఖాసీం, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## నరసయ్య కుటుంబానికి ఆర్థిక సహాయం

**నడిగూడెం,ఆగష్టు 30,మన సాక్షి:**



సూర్యాపేట జిల్లా నడిగూడెం మండలం రత్నవరం గ్రామంలో ఇటీవల కరెంటు షాక్ తో మృతి చెందిన మొలుగురి నర్సయ్య కుటుంబాన్ని ఏ సమయంలోనైనా ఆదుకుంటామని రత్నవరం గ్రామం మాజీ సర్పంచ్ రామిని విజయవర్ధన్ రెడ్డి వారికి తక్షణసాయంగా 10 వేల రూపాయలు ఇచ్చి వారి చిన్నపిల్లల చదువుల విషయంలో గానీ, కుటుంబ పోషణలో గాని, నేను ముందుంటానని నరసయ్య గ్రామంలో ఏ విషయంలోనైనా ముందుండి గ్రామానికి సేవ చేసిన వ్యక్తి, అతనిని గ్రామస్తులు ఎప్పటికీ మరచిపోకుండా గుర్తుపెట్టుకుంటారని అతను చిరస్మరణీయుడని తెలిపారు.ఈ కార్యక్రమంలో గ్రామస్తులు నందిగామ రామారావు, కాంపాటి ఉపేందర్, దాట్ల నాగేశ్వరరావు, కలకొండ వీరయ్య, గజ గంటి శ్యాం కుమార్, కాంపాటి ప్రతాప్, దున్న మీనయ్య,మోలుగురి సైదులు, మొలుగూరి కోటయ్య ఆదిమల్ల తిరపయ్య, మొలుగూరి సైదులు మొలుగూరి క్రాంతి కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## స్థానిక ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా సహకరించాలి



**వేములపల్లి,ఆగష్టు 30,మన సాక్షి:**

స్థానిక సంస్థల ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా రాజకీయ పార్టీల నేతలు సహకరించాలని స్థానిక సంస్థల మండల పరిషత్ ఓటర్ లిస్టు,పోలింగ్ స్టేషన్ ఎన్నికల నిర్వహణ అధికారి జితేందర్ రెడ్డి అన్నారు. శనివారం స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో మండలంలోని వివిధ గ్రామాల రాజకీయ పార్టీ నాయకులతో మిర్యాలగూడ సబ్ కలెక్టర్ అమిత్ నారాయణరెడ్డి రాజకీయ పార్టీల ప్రజా ప్రతినిధులతో ఎన్నికల నిర్వహణపై సమక్ష నిర్వహించారు.. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆయా గ్రామపంచాయతీ ఎంపీడీవో కార్యాలయంలో ప్రదర్శించిన ఓటర్ల జాబితాలో అభ్యంతరాలు ఉంటే ఈనెల 30లోగా ఎంపీడీవోలకు సమర్పిస్తే 31న పరిష్కరించి సెప్టెంబర్ 2న వార్డుల వారీగా తుది జాబితా విడుదల చేస్తామన్నారు.ఈ కార్యక్రమంలో పలు పార్టీల మండల అధ్యక్షులు, గ్రామ శాఖలు, పార్టీ నాయకులు, కార్యదర్శులు, పాల్గొన్నారు.

## ఉచిత పశువైద్య శిబిరానికి విశేష స్పందన

**రామసముద్రం,ఆగష్టు 30,మన సాక్షి:**



మండలంలోని ఊలపాడు పంచాయతీ బి. కురపల్లి గ్రామం నందు శనివారం పశువైద్య అధికారి పావని ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ పావని మాట్లాడుతూ ఉచిత పశు వైద్య శిబిరం నందు బొటాక్స్ స్ప్రే 124 లేత దూడలకు నట్టల నివారణ మందు 20 పాడి పశువులకు చికిత్సలు 11 చూడి పరీక్షలు 4 నిర్వహించామన్నారు. వర్షాకాలంలో వచ్చే వ్యాధులు పట్ల రైతులు జాగ్రత్తగా ఉండాలని ఆమె తెలిపారు.అలాగే సబ్సిడీ జొన్నలు70/ శాతం ప్రభుత్వం నుండి కార్యాలయానికి వచ్చాయన్నారు.ఈ కార్యక్రమంలో జేఈఓ భాను ప్రకాష్, పశు సహాయకులు రవికుమార్,అక్షయ్, రమేష్ పాడి రైతులు పాల్గొన్నారు.

## విద్యార్థులు ఉన్నతగా రాణించాలి

**సూర్యాపేట,ఆగష్టు 30,మన సాక్షి:**



జిల్లా కేంద్రంలోని 60 ఫీట్ రోడ్డులో గల మహర్షి డిగ్రీ కళాశాల ఫ్రెషర్స్ డే వేడుకలను శనివారం జిల్లా కేంద్రంలోని సూర్యాపేట ఫంక్షన్ హాల్ లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ పల్లె నగేష్,కరస్పాండెంట్ నారాయణ ప్రవీణ్ రెడ్డి, చైర్మన్ జిన్నె రమాదేవి మాట్లాడుతూ తాము ఎలాంటి లాభాపేక్ష లేకుండా నాణ్యమైన విద్యను విద్యార్థులకు అందించేందుకు 2023లో మహర్షి డిగ్రీ కళాశాల తిరిగి ప్రారంభించామన్నారు.విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నతంగా రాణించాలని అన్నారు.సెమిస్టర్ పరీక్షలలో 10కి 10 జీపీఏను సాధించే విద్యార్థులకు రూ.10 వేలు నగదు బహుమతిని అందజేస్తామన్నారు.తమ డిగ్రీ కళాశాలలో ఆర్టిఫిషియల్ ఇంటిలిజెంట్ కోర్సును ఈ ఏడాది నుండి ప్రారంభించినట్లు తెలిపారు. యూనివర్సిటీ పరిధిలో తమ కళాశాల విద్యార్థులు ఉత్తమ ఫలితాలను సాధిస్తున్నారని చెప్పారు. విద్యార్థులు ఒక లక్ష్యాన్ని ఏర్పరచుకొని ఆ లక్ష్యాన్ని సాధించే వరకు విశ్రమించవద్దని అన్నారు. తాము విద్యార్థులకు అన్ని విధాలుగా అండగా ఉంటామన్నారు. అనంతరం విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## కట్టెల కామేశ్వరమ్మ చిత్రపటానికి నివాళులు



**పెన్ పహాడ్, ఆగష్టు 30,మన సాక్షి:**

మండలంలోని నవ తెలంగాణ రిపోర్టర్ కట్టెల విజయ్ కుమార్ మాతృమూర్తి కట్టెల కామేశ్వరమ్మ మృతి కుటుంబానికి తీరని లోటని మండల ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు ధనియాకుల వెంకటేశ్వర్లు,ప్రెస్ క్లబ్ ప్రధాన కార్యదర్శి చెరుకుపల్లి నాగేశ్వరరావు అన్నారు.మండల పరిధిలోని చెట్ల ముకుందాపురం గ్రామానికి చెందిన నవ తెలంగాణ విలేకరి కట్టెల విజయ్ కుమార్ మాతృమూర్తి కట్టెల కామేశ్వరమ్మ (75) అనారోగ్యంతో గురువారం మృతి చెందగా శనివారం మండల పత్రిక విలేకరులు ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళు లర్పించి కుటుంబానికి ప్రగాఢ సంతాపం తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రెస్ క్లబ్ ఉపాధ్యక్షుడు బొల్లిగొండ వీరస్వామి, ప్రధాన కార్యదర్శి చెరుకుపల్లి నాగేశ్వరరావు, సహాయ కార్యదర్శి మీసాల నాగయ్య, సంయుక్త కార్యదర్శి షేక్ సయ్యద్, పాలకూర రవి, మచ్చ మహేష్, కత్తి ఉపేందర్, సతీష్ పాల్గొన్నారు.

## శివాలయంలో యజ్ఞశాల నిర్మాణం

**కేతేపల్లి,ఆగష్టు 30,మన సాక్షి:**



కేతేపల్లి మండల కేంద్రంలోని శ్రీ శంభు లింగేశ్వర స్వామి శివాలయం లో నూతనంగా యజ్ఞశాల నిర్మించారు. దాత చందా రామమూర్తి అనురాధ దంపతులు, వారి కుటుంబం శనివారం నూతనంగా నిర్మించిన యజ్ఞశాల లో యాగం నిర్వహించారు. ఆలయ పూజారి కాటేపల్లి శ్రీనివాస శర్మ ప్రత్యేక పూజలు, యాగ క్రతువులు జరిపించారు. మండల కేంద్రంలో ఇంతవరకు యజ్ఞశాల లేకపోవడం వలన యాగం నిర్వహించుకోవడానికి ఇబ్బందిగా ఉండేదని యజ్ఞశాల నిర్మించటం సంతోషదాయకంగా ఉందని, భక్తులకు ఆనందదాయకమని శివాలయం కమిటీ చైర్మన్ సంకోజు జేజయ్య అన్నారు. ఈ సందర్భంగా శివాలయ కమిటీ చైర్మన్ తోపాటు కార్యవర్గసభ్యులు, గ్రామస్తులు దాతను అభినందించారు.

## భాషా పండితుల అప్ గ్రేడేషన్ ప్రభుత్వానికి కృతజ్ఞతలు

**సూర్యాపేట,ఆగష్టు 30,మన సాక్షి:**

రాష్ట్ర వ్యాప్తంగా గత సంవత్సరం భాషా పండితుల అప్ గ్రేడేషన్ అనంతరం మిగిలిపోయిన హిందీ, తెలుగు,ఉర్దూ తదితర భాషా పండితులకు స్కూల్ అసిస్టెంట్ గా ప్రమోషన్లు కల్పించిన రాష్ట్ర ప్రభుత్వానికి ముఖ్యంగా రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కి రాష్ట్రీయ ఉపాధ్యాయ పండిత పరిషత్తు ఆర్ యూ పి పి టి జి సూర్యాపేట జిల్లా పక్షాన కృతజ్ఞతలు తెలియజేస్తున్నాము. అధ్యక్షులు గుంటి సత్యనారాయణ కార్యదర్శి శ్రీనివాస్ రావు ప్రకటన లో అన్నారు.అదేవిధంగా 2024 డీఎస్సీ ద్వారా నియామకమైన భాషా పండితులను కూడా అప్గ్రేడ్ చేసి అప్గ్రేడేషన్ ప్రక్రియను సంపూర్తి చేయాలని కోరారు. ఈ ప్రక్రియ కొరకు పట్టువదలని విక్రమార్కుల వలె ప్రయత్నం చేసిన రాష్ట్ర అధ్యక్షులు మహమ్మద్ అబ్దుల్లా మరియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుళ్ళపల్లి తిరుమల కాంతి కృష్ణ రాష్ట్ర కార్యవర్గానికి అభినందనలు తెలిపారు.

## ఓటరు జాబితా పై అఖిలపక్ష సమావేశం

**అర్వపల్లి,ఆగష్టు 30,మన సాక్షి:**



గ్రామపంచాయతీ ఎన్నికల సందర్భంగా ఓటరు జాబితా వార్డుల వివరాలపై అభ్యంతరాలు ఉంటే తెలియజేయవలసిందిగా మండల ప్రత్యేక అధికారి బి శ్రీధర్ రెడ్డి అన్నారు. శనివారం మండల అభివృద్ధి కార్యాలయంలో అన్ని పార్టీల నాయకుల సమావేశం ఏర్పాటు చేసి వారి సూచనలను అభ్యంతరాలను తెలుసుకున్నారు. మండల పరిధిలో 152 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఓటరు జాబితాలో ఏమైనా అనుమానాలు ఉంటే తెలియజేయవలసిందిగా కోరారు. ఓటరుజాబితాలో గాని పోలింగ్ కేంద్రాల ఏర్పాటులో గాని, పోలింగ్ కేంద్రాల లలో సౌకర్యాలపై సమస్యలను తెలియజేస్తే రెండవ తారీకు లోపు సవరిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల తాసిల్దార్ బి. శ్రీకాంత్, ఎంపీడీవో తిరునగరి గోపి, కాంగ్రెస్ పార్టీ నుండి, భైరబోయిన మహారాజు, పెసర సతీష్ రెడ్డి, నర్సింగ్ శ్రీనివాస్ గౌడ్, శిగ నసి ర్ గౌడ్, దాసరి సోమయ్య, మామిడి అనిల్, వల్లాల కాజా యాదవ్, బిఆర్ఎస్ నుండి గుండగానీ సోమేశ్ గౌడ్, బీఎస్పీ నుండి చెరుకుపల్లి లక్ష్మణ్, సిపిఎం నుండి, శిగ వెంకన్న, అన్ని గ్రామాల పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు

## ఓటరు జాబితా పై అభ్యంతరాలు ఉంటే తెలపాలి

**పెన్ పహాడ్,ఆగష్టు 30,మన సాక్షి:**



ఓటరు జాబితా పై అభ్యంతరాలు ఉంటే తెలపాలని పెన్ పహాడ్ ఎంపీడీవో జానయ్య తెలిపినారు. ఓటరు జాబితాపై వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఎంపీడీవో కార్యాలయంలో శనివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు ఈ నెల 28న ఓటరు జాబితాను గ్రామపంచాయతీ కార్యాలయాల్లో ప్రదర్శించినట్లు చెప్పారు.శనివారం గ్రామ పంచాయతీలో మండల స్థాయిలో రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించడం జరిగిందని ఓటరు జాబితా పై అభ్యంతరాలు ఉంటే లిఖితపూర్వకంగా అందజేయాలన్నారు.అభ్యంతరాలను పరిశీలించి సెప్టెంబరు రెండున తుది ఓటరు జాబితాను ప్రచురిస్తామన్నారు. సమావేశంలో సూర్యాపేట జిల్లా సివిల్ సప్లై డిఎం పి రాములు, తాసిల్దార్ ధారావతు లాలు నాయక్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు తూముల సురేష్ రావు, మండల టిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు దొంగరి యుగంధర్, వివిధ పార్టీల నాయకులు పిఎసిఎస్ చైర్మన్ వెన్న సీతారాంరెడ్డి, గజ్జల సైదిరెడ్డి ,వివిధ గ్రామాల పార్టీల ప్రతినిధులు వివిధ గ్రామాల పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

# ప్రజల మనిషి డాక్టర్ రాములు నాయక్ మృతి

**దేవరకొండ,ఆగష్టు 30,మన సాక్షి :**

దేవరకొండ ప్రజల మనసు గెలుచుకున్న డాక్టర్, నిష్ణాతుడైన వైద్యుడు,దేవరకొండ ఏరియా ప్రభుత్వ ఆసుపత్రి మాజీ సూపరింటెండెంట్ డాక్టర్ నేనావత్ రాములు నాయక్ ఇక లేరు.ఆయన మరణం దేవరకొండ వైద్య వృత్తికి, ప్రజలకు తీరని లోటు నిస్వార్థంగా సేవలందించి, ప్రజల గుండెల్లో చెరగని ముద్ర వేసుకున్న డాక్టర్ రాములు నాయక్ ఇక లేరనే వార్త స్థానికులను తీవ్రంగా కలచివేసింది.



### ప్రజల వైద్యుడు:

డాక్టర్ రాములు నాయక్ ఒక వైద్యుడు మాత్రమే కాదు, ఆయన ప్రజలకు ఆప్తుడు, స్నేహితుడు. ఆయన వైద్యం డబ్బు సంపాదనకు కాదు, ప్రజలకు సేవ చేయడానికి అని బలంగా నమ్మారు. దేవరకొండ ఏరియా ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్ గా ఆయన పని చేసిన కాలంలో, ఆసుపత్రికి కొత్త జీవం తెచ్చారు. రాత్రి పగలు తేడా లేకుండా ఆసుపత్రిలోనే ఉండి, పేద రోగులకు మెరుగైన వైద్యం అందేలా చూసుకున్నారు. మారుమూల గ్రామాల నుండి వచ్చే రోగులకు కూడా సులభంగా వైద్య సేవలు అందేలా ఏర్పాట్లు చేశారు. ఆయన చొరవతో ఆసుపత్రిలో పరిశుభ్రత, మెరుగైన నిర్వహణ, రోగులకు సరైన సదుపాయాలు లభించాయి. ఆయన ఆసుపత్రిని కేవలం ఒక భవనంగా కాకుండా,ఒక నమ్మకమైన సేవా కేంద్రంగా మార్చారు.

# బత్తాయి పంటను కాపాడేందుకు ప్రభుత్వానికి సూచనలు చేస్తాం

**నలగొండ, ఆగస్టు 30, మన సాక్షి:**




నల్గొండ జిల్లాలో బత్తాయి పంటను కాపాడేందుకు ప్రభుత్వానికి సూచనలు చేస్తామని తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ, రైతు సంక్షేమ కమిషన్ చైర్మన్ కోదండ రెడ్డి అన్నారు.కమిషన్ రెండు రోజుల నల్గొండ జిల్లా పర్యటనలో భాగంగా శనివారం నల్గొండ జిల్లా కేంద్రంలోని ఉదయాదిత్య భవన్లో బత్తాయి రైతులు ,ఉద్యాన శాఖ అధికారులు, శాస్త్ర వేత్తలతో బత్తాయి రైతులు ఎదుర్కొంటున్న సమస్యలు ,సూచనలు, సలహాలపై ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కమిషన్ పర్యటనలో భాగంగా నల్గొండ జిల్లాలో నిడమనూరు మండలంలోని కొన్ని గ్రామాలలో బత్తాయి తోటలను పరిశీలించడమే కాకుండా, రైతులతో మాట్లాడడం జరిగిందని, నల్గొండ జిల్లా కేంద్రం సమీపంలో ఉన్న బత్తాయి మార్కెట్ ను సందర్శించి రైతులు, సమస్యలు, అభిప్రాయాలను తెలుసుకొన్నట్లు చెప్పారు. బత్తాయి రైతుల సమస్యలను , అభిప్రాయాలను క్రోడీకరించి సమగ్రమైన నివేదికను రాష్ట్ర ప్రభుత్వానికి సమర్పిస్తామని తెలిపారు. భవిష్యత్తులో బత్తాయి పంటను కాపాడేందుకు రాష్ట్ర ప్రభుత్వానికి సిఫారసు చేస్తామని చెప్పారు.జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి మాట్లాడుతూ వ్యవసాయ రైతు సంక్షేమ కమిషన్ ఆదేశాల మేరకు బత్తాయి రైతులు ఎదుర్కొంటున్న సమస్యల పై ఒక నివేదికను తయారుచేసి ప్రభుత్వానికి సమర్పిస్తామని, బత్తాయి రైతులకు లాభం చేకూర్చే విధంగా శాస్త్రీయమైన పద్ధతిలో ఒక ప్రణాళికను రూపొందిస్తామని, బత్తాయి రైతుల సూచన మేరకు బత్తాయిని పాఠశాలలు, హాస్టల్స్ కు పంపిణీ చేసే విషయమై ప్రభుత్వానికి నివేదిస్తామని తెలిపారు. జిల్లాలో ఉద్యాన పంటలకు సంబంధించి ప్రత్యేకంగా క్లస్టర్ ఏర్పాటు చేయాలని, ఎక్స్టెన్షన్ ఆఫీసర్లను నియమించాలని జిల్లా కలెక్టర్ కమిషన్ దృష్టికి తీసుకువచ్చారు. భూవిధాల పరిష్కారంలో భాగంగా సాదా బైనామాల సమస్యలపై స్థానిక సమస్యలపై పరిశీలించి ప్రభుత్వానికి నివేదిక ఇస్తామన్నారు.

డైరెక్టర్ ఆఫ్ రీసెర్చ్ సురేష్ రెడ్డి మాట్లాడుతూ బత్తాయి మొక్కల లోపం వల్ల ఎక్కువ మంది రైతులు నష్టపోతున్నట్టు తాము గుర్తించామని,అలాగే చీడ పీడలు, వారి విపరీతంగా పెరిగిపోవడం వంటి కారణాలను గుర్తించామన్నారు. కొండమల్లేపల్లి లోని ఉద్యాన పరిశోధన కేంద్రాన్ని బలోపేతం చేసేందుకు చర్యలు తీసుకుంటామని, రైతులు ఎదుర్కొంటున్న చీడపీడల సమస్యను దూరం చేసేందుకు కృషి చేస్తామని చెప్పారు.ఈ సమావేశానికి హాజరైన బత్తాయి రైతులు ,రైతు ఉత్పాదక సంస్థల ప్రతినిధులు నంద్యాల నరసింహారెడ్డి, రాంరెడ్డి, కర్నాటి లింగారెడ్డి ,నూకల వెంకటరెడ్డి, అశోక్ రెడ్డి, అంజిరెడ్డి ,శ్రీనివాస్ రెడ్డి, జంగం రాజు ,సత్యనారాయణ రెడ్డి తదితరులు మాట్లాడుతూ నల్గొండలో బత్తాయి మార్కెట్ ను కాపాడాలని అన్నారు. వ్యవసాయ శాఖ జె డి బాబు మాట్లాడారు. అదనపు కలెక్టర్లు జే. శ్రీనివాస్, నారాయణ అమిత్ ,రాష్ట్ర జిల్లా ఉద్యాన శాఖ ఉపసంచాలకులు సుభాషిని, జిల్లా వ్యవసాయ అధికారి శ్రవణ్, మార్కెటింగ్ శాఖ అధికారి ఛాయాదేవి, వ్యవసాయ కమిషన్ ఓ ఎస్ డి గోపాల్ ,ఆర్డీవోలు అశోక్ రెడ్డి, రమణారెడ్డి, ఉద్యాన శాఖ అధికారి అనంతరెడ్డి ,తదితరులు ఈ సమావేశంలో పాల్గొన్నారు.

# ఈకేవైసీ టిహెచ్ఆర్ నూరు శాతం పూర్తి చేయాలి: జిల్లా సంక్షేమ అధికారి కృష్ణవేణి

**నల్లగొండ,ఆగస్టు 30,మన సాక్షి:**



అంగన్వాడీ కేంద్రాల ద్వారా లబ్ధి పొందుతున్న వారి వివరాలు ఈకేవైసీ టిహెచ్ఆర్లలో నూరు శాతం పూర్తిచేయాలని, దానికి అనుగుణంగానే వచ్చే నెల పౌష్టికార ఇండెంట్ వస్తుందని జిల్లా శిశు సంక్షేమ శాఖ అధికారి కె.వి కృష్ణవేణి అన్నారు.శనివారం నల్గొండ ప్రాజెక్ట్ పరిధిలోని చర్లపల్లి సెక్టార్ అంగన్వాడి టీచర్ల సమావేశంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ భారత ప్రభుత్వం ఈకేవైసీ టిహెచ్ఆర్ ప్రకారంగానే నిధులు విడుదల చేస్తామని ప్రకటించిందని లబ్ధిదారులకు సంబంధించిన పూర్తి వివరాలను ఆన్లైన్లో నమోదు చేయాలన్నారు. ప్రస్తుతం ఈకేవైసీలు 96 శాతం ఉందని దాన్ని రేపటిలోగా నూరు శాతం టిహెచ్ఆర్ లు 66 శాతం మాత్రమే ఉందని దాన్ని రేపటిలోగా 90 శాతానికి పెంచితేనే వచ్చే నెలకు సంబంధించిన ఇండెంట్ వస్తుందని తెలిపారు. ఆన్లైన్ పూర్తి చేసిన వారికి మాత్రమే పౌష్టికాహారం అందించేందుకు వీలుంటుందని తెలిపారు. టీచర్లు అధికారులు సమన్వయంతో పని చేస్తూ వాటిని నూరు శాతం పూర్తి చేయాలని ఆదేశించారు. అదేవిధంగా పోషకాహార లోపంతో బాధపడుతున్న పిల్లలపై ప్రత్యేక దృష్టి సారించి వారిని ఆరోగ్యవంతులుగా తీర్చిదిద్దేందుకు కృషి చేయాలని తెలిపారు. చిన్నారులంతా ప్రైవేటు స్కూళ్లకు కాకుండా అంగన్వాడి కేంద్రాలకు వచ్చేలా ప్రోత్సహించాలని తెలిపారు. అంగన్వాడి సర్వే జనాభా వెయ్యి మందికి పైగా ఉంటే సర్వేలోని చిన్నారులందరిని నమోదు చేసి 20 మందికి తగ్గకుండా అంగన్వాడి స్కూల్ కి వచ్చేలా చూసుకోవాలని ఆదేశించారు. ప్రతిరోజు అంగన్వాడి సెంటర్లు సమయానికి తీస్తూ సిబ్బంది యూనిఫామ్ ధరించాలని సూచించారు. వర్షాలు కురుస్తున్నందున అద్దె భవనాలు ఏమైనా శిధిలావస్థలో ఉంటే వెంటనే వాటిని మార్చాలని, కరెంటు ఇతర ప్రమాదం కలిగే సెంటర్లు ఉంటే వాటిని యజమాలతో చెప్పి మరమ్మతులు చేయించాలని అన్నారు. ఈ సమావేశంలో సిడిపిఓ తూముల నిర్మల సూపర్వైజర్ పార్వతి అంగన్వాడీ టీచర్లు కుర్షిదాబేగం, సుశీల, విజయ, రజిత, మంగ, సావిత్రమ్మ, పకృతాంబ, సునంద,పుష్పమ్మ, శంకరమ్మ, లావణ్య, లక్ష్మమ్మ, శిరిష, అనిత తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా కుంకుమార్చన
## వినాయకునికి ప్రత్యేక పూజలు



**నల్లగొండ, ఆగస్టు 30, మన సాక్షి:**

గణేష్ నవరాత్రి ఉత్సవాలలో భాగంగా రామగిరి లోని చందమామ టవర్స్ లో నెలకొల్పిన గణేష్ మండపం ముందు శుక్రవారం రాత్రి ఘనంగా భక్తి శ్రద్ధలతో స్వామివారికి కీర్తనలతో వేదమంత్రాల నడుమ మహిళలు కుంకుమ పూజను ఘనంగా నిర్వహించారు.అనంతరం గణనాధునికి ప్రత్యేక అలంకరణ చేసి పూజలు నిర్వహించారు. గణనాధునికి వివిధ రకాల నైవేద్యాలను సమర్పించి గణనాథుని ఆశీర్వాదం తీసుకున్నారు. అనంతరం అన్నదాన ప్రసాద వితరణ కావించారు.ఈ కార్యక్రమంలో గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులు అపార్ట్మెంట్ కు చెందిన మహిళలు పాల్గొన్నారు.

# వెళ్లి రావయ్యా బొజ్జ గణపయ్య



**రామసముద్రం,ఆగస్టు 30,మన సాక్షి:**

అన్నమయ్య జిల్లా మండలంలోని మూగవాడి గ్రామ పంచాయతీ గుండ్లపల్లె గ్రామంలో శనివారం అంగరంగ వైభవం గా వినాయక నిమర్జనం జరిగింది.మేళతాళాల నడుమ పురవీదుల్లో ఊరేగింపు. మహిళ లు మహా గణపతి స్వామివారికి మంగళ హారతులు పట్టి కొబ్బరికాయలు కొట్టి మొక్కులు చెల్లించుకున్నారు. బానసంచాలు కాలుస్తూ యువతీ, యువకులు చిన్న పిల్లలు రంగులు చల్లుకుని కోలా హాలంగా నిమర్జనం కార్యక్రమం నిర్వహించడం జరిగింది. గుండ్లపల్లె గ్రామ పెద్దలు, గ్రామస్థులు ఆధ్వర్యంలో అన్నదానం నిర్వహించారు . ఎలాంటి సంఘటనలు జరగకుండా ఎస్సై డి. రమేష్ బాబు ఆధ్వర్యంలో పలు గ్రామాల్లో నిర్వహిస్తున్న వినాయక స్వామి వారి నిమిజ్జనం పోలీస్ సిబ్బంది బందోబస్తీ నిర్వహించారు. సాయంత్రం చెరువులో స్వామి వారిని నిమర్జనం చేశారు.

# ఆదర్శ పాఠశాలలో మిగిలిన సీట్లకు స్పాట్ అడ్మిషన్

**దామరచర్ల,ఆగష్టు 30,మన సాక్షి:**



మండల పరిధిలోని బోత్తలపాలెంలో గల ఆదర్శ పాఠశాలలో 2025-2026 విద్యా సంవత్సరానికి గాను 6వ తరగతి నుండి 9వ తరగతి వరకు అదే విధంగా ఇంటర్ మొదటి సంవత్సరంలో ఎంపీసీ,బైపీసీ, ఎంఈసి,సీఈసీ గ్రూపులలో మిగిలి ఉన్న ఖాళీల భర్తీకి స్పాట్ అడ్మిషన్స్ తీసుకోవడం జరుగుతుందని కళాశాల ప్రిన్సిపాల్ పోతురాజు నరహరి ఒక ప్రకటన తెలియజేశారు. ఆసక్తి గల విద్యార్థులు తమ యొక్క టీసీ,స్టడీ కండక్ట్,ఆధార్ కార్డ్ జిరాక్స్,రెండు పాస్ ఫోటోలతో పాఠశాల పని వేళలో దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. అదేవిధంగా ఇంటర్ ప్రథమ సంవత్సరంలో బాలికలకు పరిమితిగా ఉచిత హాస్టల్ సీటు ఉన్నాయని కాబట్టి పదవ తరగతి పూర్తి చేసిన బాలికలు వెంటనే ప్రిన్సిపాల్ ను సంప్రదించాలని పేర్కొన్నారు. ప్రిన్సిపాల్ ఫోన్ నెంబర్: 98857 61013.

# గణపతి నవరాత్రులు..అన్నప్రసాదం

**అర్వపల్లి,ఆగస్టు 30,మన సాక్షి:**



మండల కేంద్రంలోని సాయిబాబా దేవాలయ ఆవరణలో నిలిచిన వినాయకునికి శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. సీనియర్ కాంగ్రెస్ నాయకులు భైరబోయిన మహారాజు ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రార్థన అనంతరం భక్తులకు అన్నప్రసాదాన్ని పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా సీనియర్ కాంగ్రెస్ నాయకుడు మాజీ జడ్పిటిసి కోర పిడత అవి లయ్యయాదవ్, పాల్గొని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మహారాజ్, మండల ఉపాధ్యక్షుడు దాసరి సోమయ్య, రాజబోయిన జగన్, నిమ్మల నిరంజన్, కో మారి నాగరాజు, తోట్టి నరసయ్య, సత్యనారాయణ, రామ్మూర్తి, పాల్గొన్నారు.

# డాక్టర్ రాములు నాయక్ మృతి తీరని లోటు

**దేవరకొండ,ఆగష్టు 30,మన సాక్షి :**



దేవరకొండ సీనియర్ వైద్యుడు డాక్టర్ ఎన్. రాములు నాయక్ మరణం పట్ల దేవరకొండ ఎమ్మెల్యే బాలు నాయక్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. రాములు నాయక్ మృతి తీరని లోటని ఆయన పేర్కొన్నారు. హైదరాబాద్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ రాములు నాయక్ శుక్రవారం తుదిశ్వాస విడిచారు. ఆయన మృతి విషయం తెలిసిన వెంటనే ఎమ్మెల్యే బాలు నాయక్ డాక్టర్ రాములు నాయక్ నివాసానికి చేరుకుని నివాళులర్పించారు. రాములు నాయక్ ఆత్మకు శాంతి కలగాలని ప్రార్థిస్తున్నానని, వారి కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నానని ఎమ్మెల్యే బాలు నాయక్ అన్నారు.

**రాములు నాయక్ మృతి బాధాకరం:**

దేవరకొండ పట్టణానికి చెందిన సీనియర్ వైద్యులు డాక్టర్ ఎన్.రాములు నాయక్ మృతి పట్ల మాజీ ఎమ్మెల్యే రవీంద్ర కుమార్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. రాములు నాయక్ మృతి తమను ఎంతగానో కలచివేసిందని, వారి మరణం దేవరకొండ ప్రాంతానికి తీరని లోటని ఆయన అన్నారు. రాములు నాయక్ సేవలు ఈ ప్రాంత ప్రజలకు చిరస్మరణీయం అని ఆయన కొనియాడారు. వారి ఆత్మకు శాంతి కలగాలని, వారి కుటుంబ సభ్యులకు ఈ బాధను తట్టుకునే శక్తిని ఇవ్వాలని ఆ భగవంతుడిని ప్రార్థించారు.

# ఓటరు జాబితా పై అభ్యంతరాలు ఉంటే చెప్పాలి

**కంగ్టి, ఆగస్టు 30, మన సాక్షి :**



రానున్న గ్రామపంచాయతీ ఎన్నికల దృష్ట్యా ఓటరు జాబితాపై ఏమైనా అభ్యంతరాలు ఉంటే తెలియజేయాలని ఎంపిడిఓ శ్రీనివాసులు రాజకీయ పార్టీ ప్రతినిధులను కోరారు. శనివారం కంగ్టి ఎంపీడీవో కార్యాలయంలో రాష్ట్ర ఎన్నికల సంఘం సూచన మేరకు గుర్తింపు పొందిన రాజకీయ పార్టీ ప్రతినిధుల, ఎంపిఓ సుభాష్ తో కలిసి ఎంపిడిఓ ఓటరు జాబితా తయారి, ప్రచురణ, పోలింగ్ స్టేషన్ల వద్ద జాబితా ప్రచురణ తదితర అంశాలపై సమావేశం నిర్వహించారు.ఓటరు జాబితాల్లో ఎలాంటి లోపాలు, పొరపాట్లు ఉన్న గ్రామస్థాయిలో సమస్య పరిష్కారం కాకపోతే మండల స్థాయి అధికారులు ఫిర్యాదు చేయవచ్చని చెప్పారు. సెప్టెంబర్ 2న తుది ఓటరు జాబితా ప్రచురిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ పార్టీల మండల అధ్యక్షులు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# దొంగతనం కేసులో నిందితుడి అరెస్ట్..!

**భీంగల్, ఆగస్టు 30,మన సాక్షి:**



దొంగతనం కేసులో నిందితుడిని అరెస్టు చేసినట్లు భీంగల్ సీఐ సత్యనారాయణ తెలిపారు. మోర్తాడ్ గ్రామం భగత్ సింగ్ కాలానీకి చెందిన గురుడి అమృత్ రావు ఇంట్లో రాత్రి సమయంలో గుర్తుతెలియని వ్యక్తులు ప్రవేశించారన్నారు. ఇంటి తాళం తీసి ఇంట్లోని 9 మాసాల బంగారం, రూ. 5వేల నగదును దొంగిలించారని చెప్పారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దొంగతనం చేసిన ఎర్ల అశోక్ ను అరెస్ట్ చేసి, బంగారాన్ని రికవరీ చేశామని సిఐ తెలిపారు...

# ఉద్యమకారులను ప్రభుత్వం ఆదుకోవాలి

**సూర్యాపేట,ఆగస్టు 30,మన సాక్షి:**



తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర ఉద్యమ సాధనలో పాల్గొన్న ఉద్యమకారులను ప్రభుత్వం ఆదుకోవాలని తెలంగాణ ఉద్యమకారుల జేఏసీ రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ మెంబర్లు గోనె విజయ, ఖమ్మంపాటి లక్ష్మమ్మలు డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర సాధనలో సుమారు 1200 మంది అమరులైనారని వారిని స్ఫూర్తిగా తీసుకొని మహిళలు కూడా కేసులకు భయపడకుండా ప్రాణాన్ని సైతం లెక్కచేయకుండా ఉద్యమ సాధనలో పాల్గొన్నారని గుర్తు చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం ఉద్యమకారుల కు ఎన్నికల ముందు ఇచ్చిన 25 వేల రూపాయల పెన్షన్,250 గజాల ఇంటి స్థలం, నాలుగు గదుల ఇంటి నిర్మాణం, సాధారణ ప్రమాద భీమా, కార్పొరేట్ తరహాలో ఉచిత వైద్యం వంటి హామీలను తక్షణమే అమలు చేయాలని కోరారు. అదేవిధంగా అస్సాం, ఒరిస్సా, రాష్ట్రాల తరహాలో 100 ఎకరాల్లో స్మృతి వనం ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ అసెంబ్లీ సమావేశాల్లోనే తక్షణమే హామీలను అమలు చేయాలని కోరారు. కార్యక్రమంలో తెలంగాణ ఉద్యమకారుల జెఏసి మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు పుట్టా సోవమ్మ, కార్యదర్శి నోముల ఉమా,పట్టణ అధ్యక్షురాలు బంటు ఎల్లమ్మ, కార్యదర్శి కొమ్మాండ్లపల్లి సుజాత,పట్టణ కమిటీ సభ్యులు మాచర్ల రామలక్ష్మి,సాయని సుగుణమ్మ తదితరులు పాల్గొన్నారు.

# వెలుగు సంఘమిత్ర శ్రీనివాసులు ఆకస్మిక మృతి

**కురబలకోట, ఆగష్టు 30,మన సాక్షి:**



మండల కేంద్రం కురబలకోట వెలుగు వీఓ 4 సంఘమిత్ర సురపాగి శ్రీనివాసులు (55) ఆకస్మికంగా మృతి చెందడం దిగ్భ్రాంతికి గురి చేసింది. అనార్యోగంతో బాధపడుతున్న ఇతన్ని కుటుంబీకులు మదనపల్లె ఆసుపత్రిలో చికిత్స చేయించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం తిరుపతికి రెఫర్ చేశారు. అక్కడ చికిత్స పొందుతూ శుక్రవారం ఉదయం మృతి చెందారు. శనివారం కురబలకోటలో ఘనంగా అంత్యక్రియలు నిర్వహించారు. వెలుగు పథకం ప్రారంభం నుండి సంఘమిత్రగా మంచిపేరు తెచ్చుకున్నారు. గ్రూపు సభ్యుల మన్ననలు పొందారు. మరో వైపు ఇతను అంగళ్లులోని మిట్స్ డీమ్డ్ యూనివర్సిటీలో సెక్యూరిటీ గార్డుగా పనిచేసేవారు. అటు యూనివర్సిటీ యాజమాన్యం, ఇటు వెలుగు అధికారులు, ఎంఎస్ లీడర్లు, సీసీలు, సంఘమిత్రలు తీవ్ర సంతాపాన్ని వ్యక్తం చేశారు.

# అర్హులైన నిరుపేదలకు ఇండ్లు మంజూరు చేయాలి

**పెన్ పహాడ్,ఆగస్టు 30,మన సాక్షి:**



ప్రజా పాలనలో అర్హులైన నిరుపేదలకు ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయాలని లింగాల గ్రామంలో శనివారం సిపిఎం పార్టీ సిఐటియు ఆధ్వర్యంలో ప్రజా సమస్యలపై పోరుబాట కార్యక్రమంలో పాల్గొని మాట్లాడుతున్న సిపిఎం పార్టీ సీనియర్ నాయకుడు సిఐటియు జిల్లా కమిటీ సభ్యుడు రణపంగ కృష్ణ లింగాల గ్రామంలో ప్రజా సమస్యలపై సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భూమి ఇల్లు లేని నిరుపేద కుటుంబాలు ఇందిరమ్మ ఇండ్లను పక్కనపెట్టి కాంగ్రెస్ ఏజెంట్లకు మాత్రమే ఇచ్చిందని ఆయన అన్నారు లింగాల టు అన్నారం రోడ్డు నిర్వహించాలని అన్నారు ప్రత్యేక అధికారుల పాలనలో ప్రజా సమస్యలు రోజురోజుకు పేరుకు పోతున్నాయి అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన వాగ్దానాన్ని వెంటనే అమలు చేయాలన్నారు. వృద్ధులు, వితంతువులు, వికలాంగులకు కొత్త పింఛన్లు మంజూరు చేయాలన్నారు. మండలంలో ఉన్న భూమిలేని పేదలకు ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకాన్ని ఇవ్వాలన్నారు. రాజకీయాలకతీతంగా అర్హులైన పేదలందరికీ ఇందిరమ్మ ఇల్లు నిర్మించి ఇవ్వాలన్నారు. మండల పరిధిలో చీదేల గ్రామంలో ఉన్న డబల్ బెడ్ రూమ్ ఇళ్లను వెంటనే అర్హులైన పేదలకు పంచి పెట్టాలన్నారు. ఇటీవల కురిసిన వర్షాల మూలంగా దెబ్బతిన్న రోడ్లకు మరమ్మత్తులు చేపట్టాలన్నారు. డ్రైనేజీ రోడ్లవెంటనే సిసి రోడ్లు నిర్మించాలన్నారు. శాస్త్రీయ పద్ధతులలో వార్డుల విభజన జరిపి ఎన్నికలు నిర్వహించాలన్నారు. రైతులకు యూరియా అందుబాటులో ఉండాలని అన్నారు లేకుంటే స్థానిక సంస్థ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ తగిన మూల్యం చెల్లించుకుంటుందని ఆయన అన్నారు ఈ కార్యక్రమంలో సిపిఎం శాఖ కార్యదర్శి రణపంగ బుచ్చి రాములు, మాజీ ఉపసర్పంచ్ మామిడి బిక్షం గౌడ్. మాజీ వార్డు నెంబర్ రణపంగ పుల్లయ్య, లోడంగి మధు రణపంగ అనీలు నవనీత. సైదులు. సురేష. వెంకన్న. తదితరులు పాల్గొన్నారు.

# పాత నేరస్తులు బైండోవర్ నిబంధనలకు కట్టుబడి ఉండాలి: జిల్లా ఎస్పీ నరసింహ

సూర్యాపేట,ఆగస్టు 30,మన సాక్షి:



పాత నేరస్తులు బైండోవర్ నిబంధనలకు కట్టుబడి ఉండాలని, సమస్యలు సృష్టించిన, ప్రోత్సహించిన, సహకరించిన చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా ఎస్పీ కే నరసింహ అన్నారు.పాత నేరస్తులకు, హిస్టరీ షీట్స్ కలిగిన వ్యక్తులకు, గంజాయి కేసులో ఉన్న నిందితులకు చట్టపరిధిలో నడుచుకోవాలని కోరుతూ రవి కన్వేన్షన్ ఫంక్షన్ హాల్ లో శనివారం అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ చట్టాల గురించి, వ్యక్తిగత ప్రవర్తనల గురించి, ప్రవర్తనలో మార్పుల గురించి, చట్ట పరిధిలో నడుచుకోవడం మొదలగు అంశాల గురించి అవగాహన కల్పించారు. అలవాటుగా సమస్యలు సృష్టించే వారిని, నేరాలకు పాల్పడే వారిని, గంజాయి రవాణా వినియోగం చేసే వారిని హెచ్చరించారు. అలవాటుగా అదే రకమైన నేరానికి పాల్పడితే పీడీ యాక్ట్ నమోదు చేసి జైలుకు పంపుతామని తెలిపారు. ఇలాంటి వ్యక్తులను ముందస్తుగా కౌన్సెలింగ్ నిర్వహిస్తాము, బైండోవర్ చేయడం జరుగుతున్నది, బైండోవర్ అనేది మళ్లీ నేరానికి పాల్పడను అని ఇచ్చే హామీ, బైండోవర్ నిబంధనలు ఉల్లంఘిస్తే అలాంటివారిని పూచి నగదును జమ చేయిస్తామని హెచ్చరించారు. గ్రామాల్లో పట్టణాల్లో శాంతియుత వాతావరణం కోసం పోలీస్ శాఖ అనుక్షణం కృషి చేస్తుందని ఎవరైనా వ్యక్తులు ఇతరులను ఇబ్బందులకు గురి చేయడం సమస్యలు సృష్టించడం సమస్యలు సృష్టించే వారిని ప్రోత్సహించడం సహకరించడం లాంటివి చేస్తే కఠినంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

పోలీస్ స్టేషన్లో నందు ఒకసారి నేర ప్రవర్తన కలిగిన వ్యక్తిగా నమోదు చేయబడితే భవిష్యత్తులో సమస్యలు ఎదుర్కోవాల్సి వస్తుందని, ఉద్యోగాలు పొందే విషయంలో, విదేశాలకు వెళ్లే క్రమంలో ఇబ్బందులు ఎదురవుతాయని గుర్తు చేశారు. గంజాయి మత్తులో భవిష్యత్తును కోల్పోతున్న యువతను సన్మార్గంలో నడిపించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉన్నదని గుర్తు చేశారు. గంజాయి మాదకద్రవ్యాల వల్ల యువశక్తి నిర్వీర్యం అవుతున్నదని యువత ఇలాంటి వాటి నుండి దూరంగా ఉండాలని కోరారు. సంప్రదాయమైన ఉత్సవాలను ప్రజలందరూ మతాలకతీతంగా కలిసిమెలిసి జరుపుకోవాలని ఎక్కడ కూడా ఇతరులను ఇబ్బందులకు గురి చేయకుండ చూడాలన్నారు.సూర్యాపేట డివిజన్ పరిధిలోని పోలీస్ స్టేషన్ల లో పాత నేరస్తులుగా ఉన్న సుమారు 200 మంది హాజరయ్యారు.ఈ సమావేశంలో సూర్యాపేట డివిజన్ డిఎస్పి ప్రసన్నకుమార్, సర్కిల్ ఇన్స్పెక్టర్లు వెంకటయ్య, రాజశేఖర్, నాగేశ్వరరావు, నరసింహారావు, స్పెషల్ బ్రాంచ్ ఇన్స్పెక్టర్ రామారావు, డివిజన్ పరిధి ఎస్సైలు సిబ్బంది పాల్గొన్నారు.

## ప్రజా వేదిక,కార్యకర్తల సభ ప్రాంగణాన్ని పరిశీలన



రామసముద్రం,ఆగస్టు 30,మన సాక్షి:

అన్నమయ్య జిల్లా సెప్టెంబర్ 1వ తేదీ పింఛన్ల పంపిణీ కార్యక్రమానికి రాజంపేటకు విచ్చేయుచున్న ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రథసారథి నారా చంద్రబాబునాయుడు రాజంపేట పర్యటన ప్రజా వేదిక మరియు కార్యకర్తలు సభా ప్రాంగణాన్నినేడు శనివారం రాజంపేట నియోజకవర్గం బోయినపల్లి కార్యకర్తలు సభా ప్రాంగణం,ఎంజీపురం ప్రజా వేదిక సభా ప్రాంగణాన్ని పరిశీలించిన రాజంపేట అసెంబ్లీ నియోజకవర్గ ఇన్చార్జ్ చమర్తి జగన్ మోహన్ రాజు.ఈ కార్యక్రమంలో ఆయన వెంట పలువురు టిడిపి ముఖ్య నాయకులు కార్యకర్తలు అభిమానులు పాల్గొన్నారు.

## ఓటర్ల జాబితా పై సమావేశం



భీంగల్, ఆగస్టు 30,మన సాక్షి:

భీంగల్ మండల పరిషత్ కార్యాలయంలో వివిధ రాజకీయ పార్టీల అధ్యక్షులు, ప్రతినిధులతో ఎంపీడీవో సంతోష్ కుమార్ సమావేశం నిర్వహించారు. గ్రామ పంచాయతీల వార్డుల ఓటర్ల జాబితా, అలాగే 244 పోలింగ్ స్టేషన్లపై అవగాహన కల్పించారు. వీటిపై అభ్యంతరాల గురించి కూడా చర్చించామని ఎంపీడీవో అన్నారు. ఈ సమావేశంలో ఓటర్ల జాబితా, పోలింగ్ స్టేషన్లపై అన్ని వివరాలు తెలియజేశామని, దీనిపై ఎవరూ అభ్యంతరాలు తెలపలేదని ఎంపీడీవో పేర్కొన్నారు. ఈ సమావేశంలో వివిధ పార్టీల అధ్యక్షులు, ప్రతినిధులు పాల్గొన్నారు.

## మైనర్లు వాహనాలు నడిపితే చర్యలు




శంకర్‌పల్లి,ఆగస్టు 30,మన సాక్షి:

మైనర్లు వాహనాలు నడిపితే చర్యలు తీసుకుంటామని శంకర్‌పల్లి సిఐ శ్రీనివాస్ గౌడ్ హెచ్చరించారు. శనివారం ప్రధాన కూడలిలో పోలీసులు ప్రత్యేక డ్రైవ్ నిర్వహిం చారు. సిఐ మాట్లాడుతూ పిల్లల మీద ప్రేమ ఉంటే వారికి వాహనాలు ఇవ్వవద్దని తల్లిదండ్రులకు సూచించారు. ఏదైనా ప్రమాదం జరిగితే జీవితాంతం బాధపడాల్సి వస్తుందన్నారు. ప్రేమ, గారాబం కంటే ప్రాణాలు ఎక్కువనే విషయం తల్లిదండ్రులు గుర్తించాలని హితవు పలికారు. చిన్న పిల్లలకు ఎలాంటి పరిస్థితుల్లోనూ వాహనాలు ఇవ్వకూడదని చెప్పారు. మైనర్లు వాహనాలు నడపడం చట్ట విరుద్ధమన్నారు. ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని, హెల్మెట్, సీటు బెల్టులు తప్పనిసరిగా ధరించాలని, అతి వేగంగా వాహనాలను నడపరాదని, మొబైల్ ఫోన్లో మాట్లాడుతూ, మద్యం సేవించి వాహనాలను నడపరాదని సూచించారు. మైనర్లు వాహనం నడిపినా, మైనర్లకు వాహనం ఇచ్చినా చర్యలు తప్పవని హెచ్చరించారు. స్పెషల్ డ్రైవ్ లో ఎస్సైలు దేవేందర్, నరేష్, శ్రీశైలం, కానిస్టేబుల్ లు ఉన్నారు.

## వినూత్న ఆలోచన సరికొత్త ఆవిష్కరణ

కురబలకోట, ఆగస్టు 30,మన సాక్షి:




వినూత్న ఆలోచన సరికొత్త ఆవిష్కరణలతో ముందడుగు వేయాలని బెంగళూరులో రెండు రోజుల పాటు జరిగిన ఆంతర్జాతీయ సమ్మిట్ లో వక్తలు పేర్కొనట్లు అంగళ్లు మిట్స్ డీమ్డ్ యూనివర్సిటీ వీసీ యువరాజ్ శనివారం తెలిపారు. బెంగళూరులోని బ్రిగ్రేడ్ గేట్వేలో జరిగిన అంర్జాతీయ సింగులారిటీ ఇండియా సమ్మిట్-25 దార్సనికులు, పరిశోధకులు, పారిశ్రామిక వేత్తలు.వ్యవస్థాపకులు, విధాన రూపకర్తలతో ప్రధాన వేధికగా మారిందన్నారు. అంగళ్లు మిట్స్ డీమ్డ్ యూనివర్సిటీకి చెందిన 120 మంది బిటెక్, ఎంబీఏ, ఎంసిఎ విద్యార్థులు ఇందులో పాల్గొన్నారు. ఈ సమ్మిట్ పై వీసీ యువరాజ్ మాట్లాడుతూ ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్,రోబోటిక్స్, బయోటెక్నాలజీ, స్పేస్ టెక్నాలజీ, క్వాంటమ్ కంప్యూటింగ్, పునరుత్పాదకశక్తి, స్మార్ట్ ఇన్ఫ్రక్టర్లలో పురోగతి ఆవిష్కరణలపై దృష్టి సారించడం జరిగిందన్నారు. సరికొత్త ఆవిష్కరణలతో ముందడుగువేయాలని సూచించారన్నారు. ఉన్నత కేరీర్ కు నెట్వర్కింగ్ ముఖ్యమని విద్యార్థులు పరిశోధన సామర్థ్యాలను పెంపొందించుకోవాలని కోరారు

## బలిజ వీధిలో కైలాసగిరి పర్వతం సెట్‌లో కొలువైన స్వామి

రామసముద్రం,ఆగస్టు 30,మన సాక్షి:



అన్నమయ్య జిల్లా గణేష్ నవరాత్రి ఉత్సవాలు కోసం మండల కేంద్రం లో వివిధ ప్రాంతంల్లో ఏర్పాటు చేసిన వినాయకుని విగ్రహాలు ప్రత్యేక ఆకర్షణ గా నిలుస్తున్నాయి. మండల కేంద్రంలోని బలిజ వీధిలోని కైలాస పర్వతం సెట్ లో ప్రతిష్టించిన బాలవినాయకుడు ప్రత్యేక ఆకర్షణం గా నిలిచింది. బలిజ సంఘం సభ్యులు, పెద్దలు మాట్లాడుతూ ఉదయం, సాయంత్రం స్వామివారికి ఆలయ పూజారి చే ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తులకు స్వామివారిని దర్శనం కల్పించి భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేయడం జరుగుతుందన్నారు. పార్వతి తనయుడుని వివిధ రూపాల్లో తీర్చి దిద్ది ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు. మండల కేంద్రం, పలు గ్రామాల్లో ఆదివారం నుంచి నిమిజ్జన కార్యక్రమాలు ప్రారంభం కానున్నాయి.

## మృతురాలి కుటుంబానికి ఆర్థిక సహాయం

సంస్థాన్ నారాయణపురం, ఆగష్టు 30, మన సాక్షి:



నారాయణపురం గ్రామానికి చెందిన గుర్రం మనేమ్మ నిన్న రాత్రి అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు ఉప్పల లింగస్వామి మణెమ్మ మృతి పట్ల సంతాపం ప్రకటిస్తూ వారి పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతున్ని మనస్ఫూర్తిగా ప్రార్థిస్తూ మృతురాలి కుటుంబానికి 5 వేల రూపాయలు నారాయణపురం మాజీ వార్డ్ నెంబర్ ఉప్పరగోని యాదయ్య, రత్తుపల్లి యాదయ్య చేతుల మీదుగా అందజేశారు.ఈ కార్యక్రమంలో యువజన కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి ఉప్పల నాగరాజు, కాంగ్రెస్ పార్టీ నాయకులు దూసరి వెంకటేష్ గౌడ్, రేవలపల్లి గోపాల్, శికిలమెట్ల హేమేందర్,కర్నాటి నవీన్, ఏపూరి శివయ్య, పల్లె ఆనంద్ గౌడ్, గుండమల్ల బలరాం, వివిధ పార్టీల నాయకులు సంగిశెట్టి లక్ష్మీనారాయణ, సూరపల్లి శ్రీనివాస్, దోర్నాల కృష్ణ బాబు పాల్గొని పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.

## కరెంటు తీగలకు మరమ్మతులు

కోటగిరి,ఆగస్టు 30, మన సాక్షి:



గత వారం రోజులుగా కురుస్తున్న భారీ వర్షానికి పంట పొలాల నుంచి గ్రామంలోకి వచ్చే వైర్లు పడిపోయాయి.పాత పోతంగల్ గ్రామంలోని పి ఎస్ ఆర్ కాలనీలో గత మూడు రోజులుగా నీళ్లు రావడంలేదని కరెంటు అధికారులు దృష్టికి తీసుకువెళ్లగా, శనివారం వైర్లను సరిచేసి కరెంట్ కలెక్షన్ అందజేశారు. దీంతో గ్రామస్తులు, కాలనీవాసులు,అధికారులపై హర్షం వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో రవి, సోయల్, హైమద్, ప్రవీణ్,జీపీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ప్రజలందరూ సుఖ సంతోషాలతో ఉండాలి

రామసముద్రం,ఆగస్టు 30,మన సాక్షి:



అన్నమయ్య జిల్లా శనివారం రాజంపేట నియోజకవర్గంలో రాజంపేట టౌన్ శాంతినగర్, ఈడి పాలెం వీధులలో వినాయక మండపాల కమిటీ సభ్యులు మరియు తెలుగు తమ్ముళ్ల ఆహ్వానం మేరకు పలు వినాయక మండపాలను సందర్శించి పలు గణనాథుల్ని దర్శించుకుని ప్రత్యేక పూజలు అభిషేకాలు చేయించిన రాజంపేట నియోజకవర్గ ఇన్చార్జ్ చమర్తి జగన్ మోహన్ రాజు. అనంతరం మండపాల దగ్గర చమర్తిని దుశ్యాలువ కప్పి గజమాలతో ఘనంగా సన్మానించి వారికి తీర్థ ప్రసాదాలు అందజేయడం జరిగినది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సకల విఘ్నాలు తొలగిపోయి ప్రతి కుటుంబం సంతోషంగా ఉండాలని అలాగే ఆ కుటుంబాలకు ఆ గణనాథుని ఆశీస్సులు ఎల్లప్పుడూ ఉండి వారు చేపట్టే పనులు ఎటువంటి ఆటంకం కలగకుండా వారికి విజయం చేకూరాలని ఆయన తెలిపారు. అంతేకాకుండా అక్కడ ఏర్పాట్లు చేసిన అన్నదాన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో వినాయక మండపాల కమిటీ సభ్యులు, తెలుగుదేశం పార్టీ ముఖ్య నాయకులు కార్యకర్తలు అభిమానులు పాల్గొన్నారు.

## సిఎం పర్యటన విజయవంతం చేయండి

రామసముద్రం,ఆగస్టు 30,మన సాక్షి:



అన్నమయ్య జిల్లా నవ్యాంధ్ర నిర్మాత రాష్ట్ర ముఖ్య మంత్రి నారా చంద్ర బాబు నాయుడు రాజంపేట పర్యటనను ఘన విజయం చేద్దామని రాజంపేట టిడిపి ఇన్చార్జ్ చమర్తి జగన్మోహన్ రాజు పిలుపునిచ్చారు. శనివారం రాజంపేట తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఆరు మండలాల అధ్యక్షులకు ముఖ్య నాయకులకు ఒకటవ తేదీ పింఛన్ల పంపిణీ కార్యక్రమానికి రాజంపేట నియోజకవర్గ బోయినపల్లి కు విచ్చేస్తున్న మన రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు గ పర్యటనను విజయవంతం చేయాలనే విషయంపై రాజంపేటలో నాయకులు, కార్యకర్తలు పసుపు సైనికులకు కొన్ని సూచనలు సలహాలు తెలియజేసిన రాజంపేట అసెంబ్లీ నియోజకవర్గ ఇన్చార్జ్ చమర్తి జగన్ మోహన్ రాజు వారికి తెలియజేయడం జరిగింది.ఈ కార్యక్రమంలో ఆరు మండలాల టిడిపి అధ్యక్షులు, తెలుగుదేశం పార్టీ ముఖ్య నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## జన్మదినోత్సవం..అన్నదానం,సేవా కార్యక్రమాలు

రామసముద్రం,ఆగస్టు 30,మన సాక్షి:



అన్నమయ్య జిల్లా పుంగనూరు నియోజకవర్గం తెలుగుదేశం పార్టీ నాయకులు, లెజెండరీ హీరో, అందరివాడు,గొప్ప మనసున్న మారాజు మాదిరాజు లక్ష్మణ రాజు ( పతిరాజు) జన్మదిన వేడుకలు అంగరంగ వైభవంగా జరిగాయి. శనివారం లక్ష్మణ రాజు పుట్టినరోజును పురస్కరించుకొని పుంగనూరు, చౌడేపల్లిలో పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. చౌడేపల్లి బస్టాండ్ లో తెలుగుదేశం యువ నాయకులు, పతి రాజు యువసేన కార్యకర్తల ఆధ్వర్యంలో ఘనంగా కేక్ కట్ చేసి కార్యకర్తలు, అభిమానులకు పంచిపెట్టారు. పతిరాజు ఇలాంటి పుట్టినరోజు వేడుకలను మరెన్నో జరుపుకోవాలని కోరుకుంటూ అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. తెలుగుదేశం కార్యకర్తలు, పతిరాజు అభిమానులు టపాకాయలు పేల్చి ఆనందోత్సాహంతో జన్మదిన వేడుకలను నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో సింగిల్ విండో చైర్మన్ పగడాల హరిప్రసాద్, యువ నాయకులు నారాయణ రాజు, కార్తీక్, సాగర్ నాయుడు, తెలుగుదేశం మండల ప్రధాన కార్యదర్శి రామకృష్ణ, బీసీ సాధికార సమితి అధ్యక్షులు శివకుమార్, కొలింపల్లి గణేష్, బోయకొండ పవన్, సీనియర్ తెలుగుదేశం పార్టీ నాయకులు, బోయకొండ మాజీ కమిటీ సభ్యులు నాగభూషనాచారి, సుధాకర్ నాయుడు, లక్ష్మిపతి రాజు, మురళి తెలుగుదేశం కార్యకర్తలు పాల్గొన్నారు.

## వినాయక శోభాయాత్ర రూట్ మ్యాప్ పరిశీలన

### సీఐ వెంకట్ రెడ్డి

దేవరకొండ,ఆగస్టు 30,మన సాక్షి :



దేవరకొండలో వినాయక చవితి ఉత్సవాల సందర్భంగా నిర్వహించే శోభాయాత్ర ఏర్పాట్లు, రూట్ మ్యాప్‌ను అధికారులు పరిశీలించారు. పర్యవేక్షణలో భాగంగా దేవరకొండ పట్టణంలో ముత్యాలమ్మ బజార్,రామాలయం, ఖిల్ల బజార్, గాంధీ బజార్ వంటి కీలక ప్రాంతాలను క్షుణ్ణంగా తనిఖీ చేశారు.శాంతిభద్రతల పర్యవేక్షణలో భాగంగా సీఐ వెంకట్ రెడ్డి, రెవెన్యూ పరమైన అంశాలను తాసిల్దార్ మధుసూదన్ రెడ్డి, పారిశుద్ధ్య, ఇతర మున్సిపల్ అంశాలను కమిషనర్ సుదర్శన్ పర్యవేక్షించారు. ఈ తనిఖీలలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు సంఘటనలు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ఈ సందర్భంగా అధికారులు తెలిపిన వివరాలు శాంతిభద్రతలు శోభాయాత్ర సమయంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా గట్టి భద్రతా ఏర్పాట్లు చేయనున్నారు. రూట్ మ్యాప్‌లో నిఘా కెమెరాలు ఏర్పాటు చేసి పర్యవేక్షిస్తారని సీఐ వెంకట్ రెడ్డి తెలిపారు.శోభాయాత్ర జరిగే మార్గాలలో ఎప్పటికప్పుడు చెత్తను తొలగిస్తూ, పరిసరాలు పరిశుభ్రంగా ఉండేలా చూస్తామని కమిషనర్ సుదర్శన్ చెప్పారు. శోభాయాత్రకు ముందు, తర్వాత ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమాలు చేపడతామని తెలిపారు. ట్రాఫిక్‌కు ఎలాంటి అంతరాయం కలగకుండా చూడాలని అధికారులకు సూచించారు. అవసరమైన చోట్ల ట్రాఫిక్ మళ్లింపులు ఉంటాయని, ప్రజలు పోలీసులకు సహకరించాలని కోరారు.

## ఓటర్ జాబితా సవరణపై అవగాహన

కోటగిరి, ఆగష్టు 30,మన సాక్షి :



ఓటర్ జాబితా సవరణలో బాగంగా పోతంగల్ మండల ప్రజా పరిషత్ కార్యాలయం ఎంపీడీవో చందర్ ఆధ్వర్యంలో శనివారం అన్ని పార్టీల నాయకులతో జాబితా సవరణపై అవగాహన నిర్వహించారు. మరణించిన వారి పేర్లు ను తొలగించాలన్నారు. మహారాష్ట్ర లో ఓట్లు వేసిన వారి పేర్లు ఇక్కడ కూడా ఉన్నాయని వారి పేర్లు ఓటర్ లిస్టు నుంచి డిలీట్ చేయాలని కోరారు. ఆప్షన్ వచ్చినప్పుడు వెరిఫికేషన్ చేసి వారి పేర్లు తొలగిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో పుప్పాల శంకర్, విట్టల్, గంగాధర్, ఏజాజ్ ఖాన్, ప్రకాష్ పటేల్, కాశ గౌడ్,శేఖర్, రాజు, ధనరాజ్,రాంబాబు, సజ్జత్, దత్తు,నాగేష్,సంజు,రాజు వివిధ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

# కమలాపురం గోదారి ముంపు ప్రాంత ప్రజలను ఆదుకోవాలి



**మంగపేట, ఆగస్టు 30,మన సాక్షి:**

గోదారి ముంపు ప్రాంతాలైన మంగపేట మండలం, కమలాపురంలో, గత కొద్దిరోజులుగా కురిసిన వర్షం వల్ల ఎర్ర వాగు ఒడ్డు పరివాహ ప్రాంతంలో నివసిస్తున్న పేద ప్రజలు సుమారు 60 కుటుంబాల, వరకు వరద నీరు వచ్చి ఇల్లు మునిగి పోయినాయి కొన్ని శిధిలావస్థలో ఉన్నాయి మరియు కొన్ని ఇల్లు కూలిపోవడం జరిగింది వరద బాధితుల ఇళ్లలో వరద చేరిన సందర్భంగా బియ్యం, నిత్యవసర వస్తువులు, కట్టుబట్టలు, మునిగిపోవడం, జరిగినది కావున ఎర్ర వాగు ఒడ్డు పరివాహ ప్రాంతంలో ఉన్న పేద ప్రజలకు ఇందిరమ్మ ఇళ్లను మరియు తక్షణ నిత్యవసర వస్తువులు ఆర్థిక సహాయం చెయ్యాలని. ఈ సందర్భంగా కాకులమర్రి లక్ష్మణ్ బాబు, ములుగు జిల్లా కలెక్టర్, టి.ఎస్. దివాకర కి, విజ్ఞప్తి చేశారు. అలాగే బిల్ట్ కాలనీ గేటు వద్ద నుండి గోదావరి కాలనీ, వరకు ఎర్ర వాగులో చెట్లు ఎక్కువగా పెరగటం మరియు చెత్తాచెదారంతో నిండిపోయి వాగుకి అడ్డంగా ఉన్న వాటిని తొలగిస్తే వరద నీరు ఇళ్లల్లో చేరదు వాటిని తొలగించాలి. ఇందిరా నగర్ లోని బేకరీ నుండి ఎర్ర వాగు వరకు పెద్ద కాలువ ప్రవహిస్తుంది. ఆ కాలువకు పెద్ద డ్రైనేజీ నిర్మాణం చేస్తే ఇళ్లలోకి వర్షపు నీరు చేరకుండా ఇందిరా కాలనీ కాలనీవాసులను ముప్పుకు గురి కాకుండా కాపాడవచ్చు కావున కాలనీవాసుల బాధలను గుర్తించి అట్టి కార్యక్రమాలను చేయాలని ఇందిరా కాలనీ, భగత్ సింగ్ కాలనీ, వాసులను ఆదుకోవాలని కమలాపురం కాలనీ వాసులతో కలిసి ములుగు జిల్లా బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు కాకుల మర్రి లక్ష్మణ్ బాబు విజ్ఞప్తి చేసి. వినతి పత్రం ములుగు జిల్లా కలెక్టర్ దివాకర్ కి, ఇవ్వడం జరిగింది ఈ కార్యక్రమంలో ములుగు బిఆర్ఎస్ పార్టీ నియోజకవర్గ ఇన్చార్జి బడే నాగజ్యోతి, పోరిక గోవింద నాయక్, గోవిందరావుపేట మాజీ జెడ్పిటిసి తుమ్మల హరిబాబు, కాకులమర్రి ప్రదీప్ రావు, ములుగు మాజీ జెడ్పిటిసి సకినాల భవాని, జిల్లా నాయకులు తాటి కృష్ణ, కమలాపురం గ్రామ కమిటీ అధ్యక్షుడు తుక్కాని శ్రీనివాస్ యలవర్తి శ్రీనివాస్, మహిళా మండల పార్టీ అధ్యక్షురాలు గోస్కుల లక్ష్మి సిద్ధంశెట్టి లక్ష్మనరావు, పంపన పార్వతి, ఎండి కుర్బాన్, చిట్టిమల్ల సమ్మయ్య, బాదావత్ శ్రీహరి, తదితరులు పాల్గొన్నారు.

## దృశ్య మద్యమం ద్వారా విద్యార్థులకు పాఠాల బోధన



**ఆమనగల్లు, ఆగస్టు 29,మన సాక్షి:**

ఆమనగల్లు మండల పరిధిలోని గౌరారం గ్రామంలో ప్రభుత్వ పాఠశాలలో దాతల సహకారంతో నిర్మించిన దృశ్య మద్యమం ద్వారా విద్యార్థులకు పాఠాల బోధన తరగతి గదిని శనివారము మండల విద్యాధికారి పాండు ప్రారంభించారు. ఈ ప్రారంభానికి ముఖ్య అతిథులుగా గ్రామ యువ నాయకులు న్యాలపట్ల నరేందర్ రెడ్డి ఆమనగల్లు పట్టణానికి చెందిన ప్రముఖ సంఘ సేవకులు పాపిశెట్టి రాము పాల్గొన్నారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి దాతలు ముందుకు వచ్చి విరాళాలు అందించి డిజిటల్ గదిని నిర్మించడం అభినందనీయమని పేర్కొన్నారు. శుభ సందర్భంగా గ్రామస్తులు దాతలను శాలువాలతో సత్కరించారు.ఈ కార్యక్రమంలో మాజీ వైస్ ఎంపీపీ నిట్ట నారాయణ, హెచ్ఎం శ్రీనివాసచారి, సుశీలయ్య అకాడమీ చైర్మన్ చిత్తరంజన్ దాసు,రాజు, ఉపాధ్యాయ సంఘాల నాయకులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## పోలీస్ కమిషనరేట్‌లో అన్నప్రసాద కార్యక్రమం



**గోదావరిఖని,ఆగస్టు 30,మన సాక్షి:**

రామగుండం పోలీస్ కమిషనరేట్ హెడ్ క్వార్టర్స్ లో ఏర్పాటు చేసిన వినాయక విగ్రహం వద్ద ఏర్పాటు చేసిన అన్న ప్రసాద కార్యక్రమంకు పోలీస్ కమీషనర్ అంబర్ కిషోర్ ఝా , మంచిర్యాల డీసీపీ ఏ.భాస్కర్, పెద్దపల్లి డీసీపీ కరుణాకర్ లతో కలిసి పాల్గొని సీపీ స్వయంగా( ఎండి హెచ్ డబ్ల్యూ ఎస్) ( మంథని డివిజన్ హ్యాండ్ క్యాప్డ్ వెల్ఫేర్ సొసైటీ), బాలల సంరక్షణ ఆశ్రమం, గోదావరిఖని, లోని పిల్లలకి ప్రసాదాన్ని వడ్డించి వారితో కలిసి అధికారులు భోజనం చేయడం జరిగింది.ఈ కార్యక్రమంలో గోదావరిఖని ఏసిపి ఎం. రమేష్ బెల్లంపల్లి ఏసిపి రవి కుమార్ , జైపూర్ ఎసిపి వెంకటేశ్వర్లు, పెద్దపల్లి ఏసీపీ జి. కృష్ణ, మంచిర్యాల ఏసీపీ ఆర్. ప్రకాష్, ఏఓ శ్రీనివాస్, వివిధ విభాగల ఇన్స్పెక్టర్ లు, ఆర్ఐలు దామోదర్, శ్రీనివాస్, శేఖర్,మల్లేశం, ఆర్ఎస్ఐ లు, స్పెషల్ పార్టీ సిబ్బంది, ఏఆర్ సిబ్బంది, సీపీఓ, వివిధ పాల్గొన్నారు.

## మండపాల వద్ద నాలుగు లడ్డూల చోరీ

**నేలకొండపల్లి, ఆగస్టు 30,మన సాక్షి :**



వినాయక మండపాల వద్ద లడ్డూలు చోరీ జరుగుతున్నాయి. ఇది నిజమండి...అర్ధరాత్రి సమయంలో మండపాల వద్ద వినాయకుడు విగ్రహాల వద్ద ఉన్న లడ్డూ లు చోరికి గురయ్యాయి. మండలం లోని మంగాపురంతండా కు చెందిన నాలుగు మండపాల వద్ద కమిటి నిర్వహకులు సాంస్కృతిక కార్యక్రమాలు కోసం ప్రతినిధులు అక్కడే ఉంటున్నారు. అర్ధరాత్రి దాటిన తరువాత లడ్డూలు చోరీ కి గుర య్యాయి. గ్రామంలో నాలుగు మండపాల వద్ద ఉన్న విగ్రహాల ముందు ఉన్న లడ్డూలు మాయం పై కమిటీ ప్రతినిధులకు అర్థం కావటం లేదని వాపోతున్నారు. నాలుగు లడ్డూలు చోరీ కావటం తో చర్చంశనీయంగా మారింది.

## భూ నిర్వాసితులకు అండగా బిజెపి

**నారాయణపేట టౌన్, ఆగస్టు 30, మన సాక్షి:**



నారాయణపేట బి కొడంగల్ ఎత్తిపోతల పథకంలో భూములు కోల్పోయిన నిర్వాసితులకు బిజెపి అండగా ఉంటుందని బిజెపి రాష్ట్ర సీనియర్ నేత నాగురావు నామాజీ భరోసా ఇచ్చారు.శనివారం జిల్లా కేంద్రం లోని మున్సిపల్ పార్క్ వద్ద చేపట్టిన భునిర్వాసితుల దీక్షలను మద్దతు ప్రకటించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భూములు కోల్పోతున్న రైతులకు న్యాయమైన పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు.రైతులు భూమిని నమ్ముకుని జీవిస్తున్నారని అలాంటి భూమిని నిస్వార్థంగా జిల్లా రైతులకు జీవనం కల్పించేందుకు సిద్దంగా ఉన్నా ప్రభుత్వం అరకొర పరిహారం చెల్లించి భూములు లాక్కోవాలని చూడడం దారుణమని అన్నారు.ఎకరాకు కేవలం14 లక్షలు ఇవ్వడం అన్యాయం అన్నారు.ఉమ్మడి జిల్లాలోని లగచర్లలో ఎకరాకు 23 లక్షలు ఇచ్చి ఇక్కడ శాశ్వత సాగునీటి కోసం సేకరిస్తున్న భూములకు మాత్రం కేవలం 14 లక్షలు ఇవ్వడం సరికాదని అన్నారు.ఎకరాకు 25 లక్షలు ఇంటికి ఒక ఉద్యో గం ఇవ్వాలని డిమాండ్ చేశారు.రైతులు చేసే పోరా టానికి బిజెపి సంపూర్ణ మద్దతు ఇస్తుందని స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో వివిధ పార్టీల నాయకు లు,రైతులు పాల్గొన్నారు.

## రైతు సంక్షేమం కోసం ప్రభుత్వం చర్యలు

**నేలకొండపల్లి, ఆగస్టు 30,మన సాక్షి:**



రైతు సంక్షేమం కోసం ప్రభుత్వం అనేక చర్యలు తీసుకుంటుందని నేలకొండ పల్లి వ్యవసాయ మార్కెట్ కమిటి చైర్మన్ వెన్నపూసల సీతారాములు పేర్కొన్నారు. స్థానిక వ్యవసాయ మార్కెట్ కమిటి కార్యాలయంలో డ్రైయర్ మరియు ఆటోమేటిక్ ఫ్యాడీ క్లీనర్స్ వినియోగం పై అవగాహన సదస్సు ను నిర్వహించార. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు.. రైతులు ధాన్యం ఎండబెట్టటం కోసం ఇబ్బందులను తొలిగించేందుకు మిషన్ ద్వారా త్వరగా డ్రై చేసుకోవచ్చునని అన్నారు. మంత్రి శ్రీనివాసరెడ్డి చొరవ తో నేలకొండపల్లి వ్యవసాయ మార్కెట్ కమిటి కి డ్రయ్యర్, ఫ్యాటీ క్లీనర్స్ న మంజూరు చేసినట్లు తెలిపారు. యంత్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. రైతులకు మద్దతు ధర ను అందించేందుకు కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. రైతుల ప్రయోజనమే ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెటింగ్ డీయం యం.ఏ.ఆలీం, సివిల్ సప్లై డియం జీ.శ్రీలత, ఏవో యం.రాధ, రైతులు నెల్లూరి భద్రయ్య, బచ్చలకూరి నాగరాజు, బెల్లం శ్రీనివాసరావు, కుక్కల హనుమంతరావు, గరిడేపల్లి రామారావు, బొందయ్య, వెంకన్న, ఈవూరి శ్రీనివాసరెడ్డి, కాశయ్య, కడియాల నరేష్, కొమ్మినేని విజయ్ బాబు తదితరులు పాల్గొన్నారు.

## గణేష్ మందిర్ లో ఎస్పీ ప్రత్యేక పూజలు



**నారాయణపేట టౌన్, ఆగస్టు 30, మన సాక్షి :**

నారాయణపేట జిల్లా కేంద్రంలోని దూల్ పేట గణేష్ మందిరంలో వినాయకునికి శనివారం జిల్లా ఎస్పీ యోగే ష్ గౌతమ్,బిజెపి రాష్ట్ర సీనియర్ నేత నాగురావు నామాజీ ప్రత్యేక పూజలు నిర్వహించారు. దూల్ పేట యువజన సంఘం నిర్వాహ కులు ఈ సందర్భంగా ఎస్పీని శాలువా తో సత్కరించింది తీర్థ ప్రసాదాలు అందజేశా రు.అనంతరం మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ నందు నామాజీ ఆధ్వర్యంలో నిర్వ హించిన అన్నదాన కార్యక్ర మాన్ని ప్రారంబించారు.ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడు తూ ప్రజలంతా వినాయక చవితి ఉత్సవాలను సంతో షంగా జరుపుకో వాలని అందరూ సుఖశాంతో షలతో సంతోషంగా ఉండాలని ప్రజలకు, పోలీసులకు అంతా మంచి జరగాలని ఆ దేవుని పార్థించడం జరిగిందని తెలిపారు. వినాయక చవితి ఉత్సవాల సందర్భం గా నారాయణపేట జిల్లా ప్రతి వినాయకునికి జియో ట్యాగ్ చేయడం జరుగుతుందని ఏక్కడ ఎలాంటి సమస్య ఉన్న వెంటనే పోలీసులు తెలుసుకొని సమస్యను పరిష్కరించడం జరుగుతుం దని ఎస్పీ తెలిపారు. వినా యక మండపాల దగ్గర వాలం టీర్లు తప్పకుండా ఉండాలని పోలీసు వారు తనిఖీకి వచ్చి న సమయంలో వారికి సహక రించాలనికోరారు.ఉత్సవాలకు జిల్లా పరి ధిలో పటిష్ట బందోబస్తు ఏర్పా టు చేయ డం జరుగుతుంద ని, సోషల్ మీడియా పై పూర్తి స్థాయి నిఘా ఏర్పాటు చేయడం జరి గిందని అన్నారు.ఈ కార్యక్ర మంలో బిజెపి జిల్లా అధ్యక్షుడు సత్య యాదవ్ ,పట్టణ అధ్యక్షుడు పోషల్ వినోద్ ,వి ఎచ్ పి,ఉత్సవ సమితి సభ్యులు తదితరులు పాల్గొ న్నారు.

## దోమల నిర్మూలనకు చర్యలు

**గోదావరిఖని,ఆగస్టు 30,మన సాక్షి:**



అదనపు కలెక్టర్ ( స్థానిక సంస్థలు ) , రామగుండం నగర పాలక సంస్థ కమిషనర్ జె. అరుణ శ్రీ ఆదేశాల మేరకు వంద రోజుల కార్యాచరణ ప్రణాళికలో భాగంగా శనివారం దోమల లార్వా తినే గ%శీ%బ్బూషియా చేపపిల్లలను నీటి కుంటలలో వదిలారు. మత్స్య శాఖ సహాకారంతో మొదటి దఫాలో ఐదు వేల గ%శీ%బ్బూషియా చేప పిల్లలను కరీం నగర్ నుండి తెప్పించి డివిజన్ లలో గుర్తించిన కుంటలు , నీరు ఎక్కువగా నిలిచి ఉండే ప్రాంతాల్లో ఈ చేపలను వదిలినట్లు కమిషనర్ తెలిపారు. లార్వా అంతరించిపోతే దోమలు సంతతి పెరగడానికి అవకాశం ఉండదని అన్నారు. దోమల నిర్మూలనకు ఫాగింగ్ , ఆయిల్ బాల్స్ వేయడం , స్ప్రేయింగ్ కార్యక్రమాలు నిరాటంకంగా కొనసాగుతున్నాయని అన్నారు. స్వచ్ఛ భారత్ మిషన్ లో భాగంగా ప్రభుత్వ ఆదేశాల మేరకు క్లీన్ లీ నెస్ టార్గెట్ యూనిట్స్ (సి టి యు ) కూడా గుర్తించడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమం కింద శనివారం గౌతమి నగర్ ప్రాంతంలో చిన్న చిన్న నీటి కుంటలను గుర్తించి నీరు నిలువ ఉండకుండా జి సి బి యంత్రం తో చదును చేయించినట్లు తెలిపారు. ప్రజలు కూడా దోమ కాటు కు గురి కాకుండా కిటికీలకు జాలీలు అమర్చుకోవడం , పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడంతో పాటు నీరు నిలువ ఉండకుండా జాగ్రత్త పడాలని కోరారు.

## ఎన్నికలు సజావుగా నిర్వహించేందుకు సహకరించాలి

**నేలకొండపల్లి, ఆగస్టు 30,మన సాక్షి:**



ఎన్నికలు సజావుగా నిర్వహించేందుకు సహకరించాలని నేలకొండపల్లి ఎంపీడీఓ యం.యర్రయ్య కోరారు. మండల పరిషత్ కార్యాలయంలో శనివారం జరిగిన రాజకీయ నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడారు.... త్వరలో జరగనున్న ఎన్నికలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు అన్ని రాజకీయ పార్టీలు నాయకులు సహాకారం చాలా అవసరం అన్నారు. ఎన్నికల సంఘం నిబంధనలు ఖచ్చితంగా పాటించాలని సూచించారు. జిల్లాలోనే మండలం ఆదర్శంగా ఎన్నికలు నిర్వహించిన ఘనత ను సమన్వయంతో సాధించేందుకు సహకరించాలని కోరారు. ఓటర్ల జాబితా పై అభ్యంతరాలు పరిశీలన చేస్తున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో తహశీల్దార్ వి.వెంకటేశ్వర్లు, మండల పంచాయతీ అధికారి శివ. ఎస్సై సంతోష్, వివిధ రాజకీయ లిపార్టీల నాయకులు మార్కెట్ కమిటి చైర్మన్ వెన్నపూసల సీతారాములు కె.వీ.రెడ్డి. ఏటుకూరి రామారావు, నెల్లూరి భద్రయ్య, కర్నాటి భానుప్రసాద్, బచ్చలకూరి నాగరాజు, గరిడేపల్లి రామారావు, ఆరెకట్ల కొండలరావు, మల్లెల గోవిందరావు, షేక్ హుస్సేన్, మాదాసు ఆదాం, బొందయ్య, సూరేపల్లి జ్ఞానరత్నం, బోయిన బలరాం, మోర మల్లయ్య, సోడేపొంగు ప్రశాంత్, కడియాల నరేష్, చిర్రా బిక్షం తదితరులు పాల్గొన్నారు.

## జిల్లాలో నూతన కార్డుదారులకు రేషన్ బియ్యం సరఫరా

### 5.788 మెట్రిక్ టన్నుల బియ్యం.

### జిల్లా సివిల్ సప్లై మేనేజర్ జీ.శ్రీలత

**నేలకొండపల్లి, ఆగస్టు 30,మన సాక్షి:**



జిల్లాలో నూతన కార్డుదారులకు కూడ ఈ నెల లో రేషన్ బియ్యంను అందించనున్నట్లు జిల్లా సివిల్ సప్లై జిల్లా మేనేజర్ జీ.శ్రీలత తెలిపారు. మండల కేంద్రంలోని మండల లెవల్ స్టాక్ పాయింట్ ను శనివారం ఆకస్మికంగా తనీఖీ చేశారు. పలు రికార్డులను పరిశీలించారు. గోడౌన్ లోని బియ్యం నిల్వలను తనీఖీ చేశారు. బియ్యం దుకాణాలకు సరఫరా విషయం పై సివిల్ సప్లై అధికారులతో చర్చించారు. ఈ సందర్భంగా ఆమె విలేకర్ల సమావేశంలో మాట్లాడారు... జిల్లాలో నూతన కార్డుదారులకు కూడ బియ్యం ను అందించేందుకు చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. ఈ నెలకు సంబంధించి 748 రేషన్ దుకాణాలకు 5,783 -మెట్రిక్ టన్నుల బియ్యం ను కేటాయించినట్లు తెలిపారు. శుక్రవారం నాటికి 3,152 మెట్రిక్ టన్నుల బియ్యం రేషన్ దుకాణాలకు చేరినట్లు తెలిపారు. మరో రెండు రోజులలో జిల్లాలోని అన్ని దుకాణాలకు బియ్యం చేరాలని ఆదేశించినట్లు తెలిపారు. అందుకు అవసరమైన రవాణా తగినట్లుగా ఏర్పాట్లు చేసుకోవాలని సూచించారు. అనుకున్న సమయం కు బియ్యం దుకాణాలకు చేరాలని సూచించారు. ట్రాన్స్పోర్టు విషయంలో నిర్లక్ష్యం చేస్తే సహించేది లేదని హెచ్చరించారు. రేషన్ డీలర్లు తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ చేపట్టిన ఆందోళన వచ్చే నెల 5 వ తేది నాటికి పరిష్కారం జరగవచ్చునని పేర్కొన్నారు. బియ్యం పంపిణీ కి ఎలాంటి అడ్డంకులు లేకుండా ప్రభుత్వం చూస్తుందని అన్నారు. ఈ విలేకర్ల సమావేశంలో సివిల్ సప్లై అధికారులు పాల్గొన్నారు.

## ఓటరు జాబితా నుండి పేర్లను తొలగించాలి

**మందమర్రి రూరల్,ఆగస్టు 30, మాన సాక్షి:**



మందమరి పట్టణవాసులు కొందరు రానున్న స్థానిక సంస్థల ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని మందమర్రి మండల పరిదిలోని గ్రామీణ ప్రాంతాలలో ఓటరుగా నమోదు చేయించు కున్నారని కాంగ్రెస్ బి. ఆర్.ఎస్ .బి.జె.పి. బీ.ఎస్పీ సి.పి.ఐ నాయకులు శనివారం రోజున మండల తహసీల్దార్ సతీష్ మండల ప్రజా పరిషత్ అధికారి రాజేశ్వర్లకు వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మందమర్రి పట్టణానికి చెందిన కొందరు నాయకులు గ్రామ పంచాయతీల ఓటరు జాబితాలలో పేర్లు నమోదు చేసుకొని స్థానిక సంస్థల ఎన్నికలలో పోటీ చేయాలని చూస్తున్నారని తెలిపారు. వారి పేర్లను ఓటరు జాబితానుండి తొలగించాలని కోరారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు బానోతు నీలయ్య, బిఆర్ఎస్ నాయకులు వేల్పుల రవి,బిజెపి నాయకులు గిర్నాటి జనార్దన్,సిపిఐ నాయకులు కామెర దుర్గారాజ్, బహుజన సమాజ్ పార్టీ నాయకులు ముల్కల్ల రాజేంద్రప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# ఉచిత వైద్య ఆరోగ్య శిబిరం విజయవంతం

## జర్నలిస్టు వృత్తి ఎంతో బాధ్యతాయుతమైనది

**నారాయణపేట టౌన్, ఆగస్టు 30, మన సాక్షి :**




జర్నలిస్టు వృత్తి సమాజంలో ఎంతో బాధ్యతయుతమైనదని, ప్రజల సమస్యలను పరిష్కరింప చేయడంలో వారి పాత్ర ఎంతో కీలకమని, అలాంటి జర్నలిస్టులు ప్రజలకు సేవ చేయాలంటే ఆరోగ్యం ముఖ్యమని జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ తెలిపారు. యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్ ( ఐజేయూ) ఆధ్వర్యంలో నారాయణపేట లైన్స్ క్లబ్, హైదరాబాద్ మలక్ పేట్ యశోద హాస్పిటల్, శ్రీ నేత్రా సనత్ నగర్ వారి సహకారంతో జిల్లా కేంద్రంలోని ఎస్.ఆర్. గార్డెన్ లో శనివారం జర్నలిస్టులు, వారి కుటుంబ సభ్యులకు ఉచిత మెగా వైద్య ఆరోగ్య శిబిరాన్ని ఏర్పాటు చేయగా ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్, జిల్లా ఎస్పీ యోగేష్ గౌతమ్ హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ నలుగురు వైద్య నిపుణులతో కూడిన 12 మంది మలక్ పేట్ యశోద ఆస్పత్రి వైద్య బృందం ఇక్కడికి వచ్చి జర్నలిస్టులకు,వారి కుటుంబీకులకు వైద్య పరీక్షలు నిర్వహించడం సంతోషకరమైన విషయమని, ఇదో అద్భుత కార్యక్రమమని ఐజేయూ యూనియన్ సభ్యులను ఆమె అభినందించారు.

జిల్లా ఎస్పీ యోగేష్ గౌతమ్ మాట్లాడుతూ జర్నలిజం అనేది చాలా బాధ్యతతో చేసే పని అన్నారు. పోర్త్ ఎస్టేట్ గా పిలువబడే మీడియా మిగతా మూడు వ్యవస్థలు సరిగ్గా పని చేస్తున్నాయా లేదా అని చూస్తుందన్నారు. శరీరం కూడా ఒక ఆర్గానిక్ యంత్రం లాంటిదని, దానికి పరీక్షలు అవసరమన్నారు. ఈసీజీ, టు డీ ఇకో, రక్త పరీక్షల లాంటి బేసిక్ పారామీటర్స్ చూసుకోవాలన్నారు. ఈ ఉచిత వైద్య శిబిరంలో జర్నలిస్టులతో పాటు వారి కుటుంబీకులు పరీక్షలు చేసుకోవడం శుభ పరిణామం అని పేర్కొన్నారు. యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్ ఐజేయూ సభ్యులు, లయన్స్ క్లబ్ సభ్యులు, యశోద ఆసుపత్రి వైద్య సిబ్బందిని ఈ సందర్భంగా ఎస్పీ అభినందించారు. కార్యక్రమంలో వర్కింగ్ జర్నలిస్ట్ ఐ జే యు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మధు గౌడ్ మాట్లాడుతూ ఒకప్పటి జర్నలిజానికి, నేటి జర్నలిజానికి చాలా మార్పు వచ్చిందని, పోటీ తత్వం పెరిగిందని తెలిపారు. అనంతరం జిల్లా కలెక్టర్, ఎస్పీలతో ఆటో యూనియన్ నాయకులను యూనియన్ సభ్యులు ఘనంగా సత్కరించారు. చివరగా కలెక్టర్, ఎస్పీ కలిసి శిబిరంలో ఏర్పాటుచేసిన ఈసీజీ టుడి ఇకో పరీక్షల కేంద్రాన్ని ప్రారంభించి, శిబిరంలో ఉన్న మిగతా అన్ని వైద్య పరీక్షల కేంద్రాలను వారు పరిశీలించారు. నారాయణపేట లయన్స్ క్లబ్ వారు జర్నలిస్టులకు ఉదయం అల్పాహారం మధ్యాహ్నం భోజన వసతిని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా పౌర సంబంధాల శాఖ అధికారి ఎంఏ రషీద్, టి యు డబ్ల్యూ జే ఐజే యూ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు కోయిలకొండ నారాయణరెడ్డి, శివశంకర్, యూనియన్ వైద్య విభాగ కన్వీనర్ గద్వాల సంజీవ్ కుమార్, సభ్యులు నక్క శ్రీనివాస్, గణప రఘు, రాజేష్ కుమార్, సులిగం సురేష్ కుమార్ తో పాటు యూనియన్ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

# మోసాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

## జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష

**ధర్మారం ,ఆగస్టు-30: మన సాక్షి,**



ఉద్యోగాలు ఇప్పిస్తామని జరిగే మోసాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్హకోయ శ్రీ హర్ష, శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రస్తుతం జిల్లాలోని ఏ ప్రభుత్వ శాఖ పరిధిలో ఔట్ సోర్సింగ్ కాంట్రాక్ట్ పద్ధతులలో నియామకాలు జరగడం లేదని కలెక్టర్ స్పష్టం చేశారు. ప్రభుత్వం ఒకవేళ వివిధ అవసరాల పై తాత్కాలిక ప్రాతిపదికన ఔట్ సోర్సింగ్ లేదా కాంట్రాక్ట్ పద్ధతులలో నియామకాలు చేపడితే కలెక్టర్ ఆధ్వర్యంలో అర్హతలు పరిశీలించి, పారదర్శకంగా ఎంపిక ప్రక్రియ జరుగుతుందని కలెక్టర్ తెలిపారు. ఔట్ సోర్సింగ్, కాంట్రాక్ట్ పద్ధతులలో ప్రభుత్వ ఉద్యోగాలు ఇప్పిస్తామని కొంతమంది దళారులు అమాయకుల వద్ద నుంచి డబ్బులు వసూలు చేస్తున్నట్లు తమకు సమాచారం అందిందని, నియామక ప్రక్రియలో డబ్బుకు, సిఫార్సులకు ఎక్కడ ఆస్కారం ఉండదని, ప్రజలు ఎవరు అనవసరంగా దళారులను నమ్మి మోసపోవద్దని, అనవసరంగా డబ్బును కోల్పోవద్దని కలెక్టర్ ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

# చిన్నారులకు స్పోర్ట్స్ డ్రెస్‌లు అందజేసిన కలెక్టర్

**నారాయణపేట టౌన్, ఆగస్టు 30, మన సాక్షి :**



నారాయణపేట జిల్లా కేంద్రంలోని సుభాష్ రోడ్ వద్ద గల బాలసదనం ( అనాథ ఆశ్రమం) చిన్నారులకు జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ శనివారం స్పోర్ట్స్ డ్రెస్ లను అందజేశారు. సదనంలోని మొత్తం 48 మంది అనాథ చిన్నారులకు కలెక్టర్ తన నిధులతో స్పోర్ట్స్ డ్రెస్ లను, (చెస్,క్యారమ్, షటిల్, రింగ్ బాల్,)ఆట వస్తువులను స్థానిక సంస్థల జిల్లా అదనపు కలెక్టర్ సంచిత్ గాంగ్వర్ తో కలిసి పంపిణీ చేశారు. స్పోర్ట్స్ బూట్లను కూడా తెప్పించాలని నిర్వాహకులకు సూచించారు. ఈ సందర్భంగా కలెక్టర్ చిన్నారులతో ముచ్చటించారు. బాగా చదువుకుని భవిష్యత్తులో ఉన్నత స్థాయికి ఎదగాలని సూచించారు. చదువుతో పాటు ఆసక్తి ఉన్న ఆటలు ఆడాలని చెప్పారు. సదనంలో భోజనం బాగా ఉంటుందా లేదా అని ఆ చిన్నారులను అడిగి తెలుసుకున్నారు. చిన్నారులకు కరాటే శిక్షణ ఇప్పించాలని, కూచిపూడి నృత్యం నేర్పించాలని డీసీపీఓ కరిష్మా ను ఆదేశించారు. అనంతరం సదనం పక్కనే ఉన్న వయోవృద్ధుల ఆశ్రమంలో ఆశ్రయం పొందుతున్న ఏడుగురు వృద్ధులకు చీరలను పంపిణీ చేసిన కలెక్టర్ వారి ఆరోగ్య పరిస్థితిని గురించి అడిగి తెలుసుకున్నారు. ఆశ్రమంలో భోజనం ఎలా ఉంటుందని, ఏమైనా ఇబ్బందులు ఉంటే తనకు చెప్పాలని కోరగా తమకు అన్ని వసతులతో పాటు మంచి భోజనం ఇస్తున్నారని వృద్ధులు తెలిపారు. ఈ కార్యక్రమంలో బాల సదనం, వయోవృద్ధుల ఆశ్రమ నిర్వాహకులు, సిబ్బంది పాల్గొన్నారు.

# 2న ఎన్నికల తుది ఓటరు జాబితా వెల్లడి



**శంకర్‌పల్లి,ఆగస్టు 30,మన సాక్షి:**

ఎన్నికల తుది ఓటర్ల జాబితా సెప్టెంబర్ 2వ తేదీన వెల్లడించనున్నట్లు శంకర్‌పల్లి ఎంపీడీవో వెంకయ్య గౌడ్ తెలిపారు. శంకర్‌పల్లి మండల పరిషత్ కార్యాలయంలో శనివారం ఆయా రాజకీయ పార్టీల ప్రతినిధులు, అధికారులు గ్రామ పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎన్నికల ఓటరు జాబితా, పోలింగ్ స్టేషన్ ల జాబితాపై ఈ నెల 30వ తేదీ లోపు ఏమైనా అభ్యంతరాలు ఉంటే ఆయా గ్రామ పంచాయతీ కార్యదర్శులకు ఫిర్యాదు చేయాలని సూచించినట్లు తెలిపారు. తుది జాబితా సెప్టెంబర్ 2వ తేదీన ప్రచురించడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్యాలయం సూపరింటెండెంట్ గోపాలకృష్ణ, మండల పంచాయతీ అధికారి గిరిరాజ్, ఉప తహసిల్దార్ బాలకృష్ణారెడ్డి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

# విద్యుత్ షాక్ తో గేదె మృతి

**కామారెడ్డి జిల్లా,ఆగస్టు 30,మన సాక్షి:**



వంండలంలోని యాడారం గ్రామ శివారులోని , వ్యవసాయ పంట పొలం వద్ద .గ్రామానికి చెందిన కాటేం శ్రీనివాస్, తండ్రి రాజయ్య అని రైతు యొక్క గేదే ,విద్యుత్ షాకుతో శనివారం మృతి చెందింది. సంఘటన స్థలాన్ని పశు వైద్యాధికారి శివకుమార్, విద్యుత్ శాఖ అధికారులు, రెవెన్యూ అధికారులు పరిశీలించారు. ఈ సందర్భంగా బాధిత రైతు మాట్లాడుతూ... విద్యుత్ షాక్ తో గేదె మృతి చెందిందని , లక్ష రూపాయలతో గేదెను కొనుగోలు చేశానని . ప్రభుత్వం తమకు నష్టపరిహారం అందించి ఆదుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి భరత్ , సిబ్బంది ఉన్నారు

# వినాయకుడిని దర్శించుకున్న రవి కుమార్



**శేరిలింగంపల్లి,ఆగష్టు 30,మన సాక్షి:**

శేరిలింగంపల్లి నియోజవర్గంలో మియాపూర్ లక్ష్మీ నగర్, మాతృశ్రీ నగర్, ఓల్డ్ హాఫీజ్ పెట్ ,కొండాపూర్ ప్రశాంతి నగర్ కాలనీలలో స్థానిక నాయకుల ఆహ్వానం మేరకు గణపతి మండపాలను సందర్శించి దర్శించుకున్నారు. ఈ సందర్భంగా రవికుమార్ యాదవ్ మాట్లాడుతూ నియోజకవర్గ ప్రజలు ఎల్లప్పుడూ సుఖ సంతోషాలతో, అష్టైశ్వర్యాలతో, ఆయురారోగ్యాలతో, ఉండాలని గణనాధుని చల్లని దీవెనలు తమపై ఉండాలని కోరారు.

# ఉపాధి హామీ పథకం పనులు పకడ్బందీగా చేపట్టాలి

**కామారెడ్డి జిల్లా,ఆగస్టు 30, మన సాక్షి:**



ఉపాధి హామీ పనులు పకడ్బందీగా చేపట్టాలని ,ఏపిడి వామన్ రావు అన్నారు. బిబిపేట్ మండల కేంద్రంలోని ,రైతు వేదికలు ఉపాధి హామీ పనుల సామాజిక తనిఖీ . 2024-25 సంవత్సరంలో చేపట్టిన 2కోట్ల 73 లక్షల రూపాయలతో ,197 రకాల పనులు చేపట్టిన ఉపాధి హామీ ఈ సందర్భంగా , పనుల ప్రజావేదిక సమావేశాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.... ఉపాధి హామీ పథకంలో భాగంగా, ఒక కోటి 23 లక్షల రూపాయలతో మల్కాపూర్ గ్రామంలో అంగన్వాడి భవన నిర్మాణం, ఉప్పరపల్లి షేరిబిబీపేట గ్రామాలలో గ్రామపంచాయతీ భవనాలు సిసి రోడ్డు నిర్మాణాలు , ఆయా గ్రామాలలో చేపట్టారని.ఒక కోటి 50 లక్షల రూపాయలతో ఉపాధి హామీ పథకం ద్వారా, ఫిష్ ఫౌండ్ నిర్మాణాలు, వాచెన్ వార్డ్, ఉపాధి కూలీలకు డబ్బులు చెల్లించారని తెలిపారు. ఉపాధి హామీ పథకం పనులలో నేషనల్ మొబైల్ మానిటరీ సిస్టం, ఎన్ఎంఎంఎస్ యాప్ లో, కూలీల వివరాలు తప్పుగా నమోదు చేశారని. ఫిష్ ఫౌండ్ నిర్మాణం పూడిక తీత ,పనులలో కొలతలు తేడాలు ఉన్నాయని. పని ప్రదేశంలో పని పేరు నేమ్ ప్లేట్ బోర్డులు, ఏర్పాటు చేయడం లేదని తెలిపారు. ఉపాధి కూలీల మస్టర్లల లో తప్పులుగా నమోదు చేయడంతో, అదనంగా డబ్బులు చెల్లించారని పనిచేసిన కూలీలకు కొంతమందికి ఇప్పటివరకు డబ్బులు చెల్లించలేదని, డిఆర్పిలు ప్రజా వేదికలో చదివి వినిపించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో పూర్ణచందర్, ఏపీఓ రజని, ఎస్ టి ఏం సాయి జ్ఞానేందర్, ఎస్ఆర్పి ప్రదీప్, పంచాయతీ కార్యదర్శులు, టెక్నికల్ అసిస్టెంట్లు, ఫీల్డ్ అసిస్టెంట్లు తదితరులు పాల్గొన్నారు.

# గణనాధునికి కార్పొరేటర్ ప్రత్యేక పూజలు

**శేరిలింగంపల్లి,ఆగష్టు 30,మన సాక్షి:**



శేరిలింగంపల్లి డివిజన్ లింగంపల్లి ఎస్ జి టవర్స్, బృందావనం కాలనీ, ఆదర్శ నగర్ కమిటీ హాల్, రాజీవ్ గృహకల్ప, రైల్ విహార్,తదితర కాలనీలలో వినాయక మండపాలలో ప్రతిష్టించిన గణనాథులు శేరిలింగంపల్లి కార్పొరేటర్ రాగం నాగేందర్ యాదవ్ పాల్గొని భక్తి శ్రద్దలతో గణనాదులని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్బంగా కార్పొరేటర్ రాగం నాగేందర్ యాదవ్ మాట్లాడుతూ.. ప్రజలందరూ సుఖశాంతులతో ఆయురారోగ్యాలతో సిరిసంపదలను కలిగి ఉండాలని ఆకాంక్షిస్తూ ఎల్లవేళలా ఆ గణనాధుని ఆశీస్సులు కలిగి ఉండేలా ప్రార్థించినట్లుగా తెలిపారు. ఈ కార్యక్రమంలో పటాన్చెరు కార్పొరేటర్ మెట్టు కుమార్ యాదవ్ , మాజీ కౌన్సిలర్ సోమదాస్ , సీనియర్ నాయకులు లక్ష్మి నారాయణ గౌడ్ ,ప్రెసిడెంట్ గడ్డం రవి యాదవ్, కొయ్యాడ లక్ష్మణ్ యాదవ్, ఎస్ జి టవర్స్ కమిటీ బొబ్బిలి రాజు యాదవ్, సుజిత్, సుభాష్ రాథోడ్, నిరంజన్, రవి, వెంకటేష్ ముదిరాజ్, చందు, సుజిత్, రఘు చారీ, వినయ్ గౌడ్, అవినాష్, సాయి, రేవంత్, మహిళలు స్వరూప, సత్యవతి, లక్ష్మి, ఆయా కాలనీల వినాయక మండప కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా

## జిల్లా ప్రధాన న్యాయమూర్తి కర్ణ కుమార్



**ఆమనగల్లు,ఆగష్టు 30,మన సాక్షి:**

ఆమనగల్లు కోర్టులో నెలకొన్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని జిల్లా ప్రధాన న్యాయమూర్తి కర్ణ కుమార్ తెలిపారు. శనివారము ఆమనగల్లు పట్టణ కేంద్రంలో కోర్టు ఆవరణలో శుద్ధ జలాల వాటర్ ప్లాంట్ క్యాంటీన్ జిరాక్స్ సెంటర్ ఉచిత వైద్య శిబిరాన్ని ఆయన స్థానిక న్యాయమూర్తి స్వరూపతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా న్యాయవాదులు అదనపు కోర్టు భవన నిర్మాణ స్థల సేకరణ అదనపు కోర్టులు కేటాయించాలని విజ్ఞప్తి చేయగా ప్రయత్నం చేస్తానని చెప్పారు.

# యూరియా కోసం రోడ్డెక్కిన రైతన్నలు

**కొల్చారం, ఆగస్టు 30,మన సాక్షి**



మండల పరిధిలో ని రంగంపేట సహకార సంఘానికి గత 15 రోజులుగా యూరియా రావడం లేదని రైతులు ఆగ్రహంతో మెదక్ సంగారెడ్డి ప్రధాన రహదారిపై శనివారం గంటసేపు ధర్నా నిర్వహించారు. మండల వ్యవసాయ అధికారి కొల్చారం మండలంలో యూరియా డిమాండ్ ను జిల్లా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లడంలో పూర్తిగా విఫలం చెల్లిందని ఆమె నిర్లక్ష్యం కారణంగానే మండలానికి యూరియా కేటాయింపుల్లో అన్యాయం జరుగుతున్నదని రైతులు ఆగ్రహం వ్యక్తం రంగంపేట సహకార సంఘానికి యూరియా ఈరోజు వస్తుంది రేపు వస్తుంది అంటూ గత 15 రోజులుగా రైతులను సహకార సంఘం చుట్టూ తిప్పుకుంటున్నారని రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. వ్యవసాయ అధికారుల నుండి సరైన సమాధానం లేకపోవడంతో రైతులు మెదక్ సంగారెడ్డి ప్రధాన రహదారిపై ధర్నాకు దిగారు. ధర్నా చేస్తున్న రైతుల వద్దకు డిసిఎంఎస్ ఉపాధ్యక్షులు అరిగె రమేష్, కొల్చారం మండల వ్యవసాయ అధికారి శ్వేతా కుమారి, ఏఈఓ రాజశేఖర్ గౌడ్లు చేరుకొని ఆదివారం ఉదయానికి రంగంపేట సహకార సంఘానికి కేటాయించిన ఒక లారీ యూరియా తోపాటు మరోలారి యూరియా అదనంగా వచ్చేట్లు చూస్తామని రైతులకు హామీ ఇచ్చారు. దీంతో రైతులు ఆందోళన విరమించారు.

# గణనాథుని ఆశీస్సులు ప్రతి ఒక్కరిపై ఉండాలి

## ఎమ్మెల్యే గాంధీ



**శేరిలింగంపల్లి,ఆగష్టు 30,మన సాక్షి:**

గణేష్ నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకొని శేరిలింగంపల్లి నియోకవర్గంలోని పలు డివిజన్ లు మియాపూర్ డివిజన్,గచ్చిబౌలి డివిజన్,కొండాపూర్ డివిజన్ లలో కాలనీ అసోసియేషన్ సభ్యుల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గణేష్ మండపాలలో గణనాథులను పీఏసి చైర్మన్,ఎమ్మెల్యే గాంధీ, కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్ లతో స్థానిక కాలనీ వాసులతో కలిసి దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆ గణనాథుని ఆశీస్సులు ప్రతిఒక్కరిపై ఉండాలని, అష్టైశ్వర్యాలతో,ఆయురారోగ్యాలతో ఉండాలని ఆ గణనాథుని వేడుకునట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు ,భక్తులు తదితరులు పాల్గొన్నారు.

# జైపాల్ రెడ్డికి పరామర్శ

**ఆమనగల్లు, ఆగష్టు 29,మన సాక్షి:**



ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వ్యక్తిగత సహాయకుడు జైపాల్ రెడ్డిని శనివారము ఆమనగల్లు మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ గుర్రం కేశవులు జైపాల్ రెడ్డి తండ్రి వెల్దండ రామచంద్రారెడ్డి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన విషయం తెలుసుకొని నాగర్కర్నూల్ జిల్లా ఉప్పునుంతల మండలం తిరుమలాపూర్ గ్రామంలో జైపాల్ రెడ్డి వారి నివాసంలో కుటుంబ సభ్యులను పరామర్శించారు. పరామర్శించిన వారిలో బికుమాండ్ల రమేష్,శ్రీను నాయక్,లు పరామర్శించారు.

## 1న రానున్న సినీ నటుడు మంచు మనోజ్

**శంకర్‌పల్లి,ఆగస్టు 30,మన సాక్షి:**

శంకర్‌పల్లి పట్టణానికి సినీ నటుడు మంచు మనోజ్ రానున్నారని శివాజీ యూత్ అసోసియేషన్ సభ్యులు తెలిపారు. ఈ సందర్భంగా శనివారం వారు మాట్లాడుతూ మున్సిపల్ పరిధిలోని తొమ్మిదవ వార్డు క్రిస్టల్ వెంచర్ లోని శివాజీ యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గణేష్ మండపానికి సెప్టెంబర్ 1న సోమవారం మధ్యాహ్నం హీరో రానున్నారని, గణపతి పూజలో పాల్గొంటారని తెలియజేశారు. అనంతరం అన్నప్రసాద కార్యక్రమంలో హీరో ప్రత్యేకంగా పాల్గొంటారని పేర్కొన్నారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అన్నదాన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

## పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

- జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి

**దేవరకొండ,ఆగస్టు 30,మన సాక్షి :**



నల్లగొండ జిల్లా దేవరకొండ పట్టణంలో పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకున్నప్పుడే కుక్కల బారిన పడకుండా ఉంటామని జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి అన్నారు. శనివారం ఆమె నల్గొండ జిల్లా,దేవరకొండ మున్సిపాలిటీలో వీధి కుక్కలు, పెంపుడు కుక్కలకు ఏర్పాటు చేసిన స్టెరిలైజేషన్, కుక్కల దత్తత కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ప్రజలు ఎక్కడ పడితే అక్కడ చెత్త, చెదారం వేయడం, ప్రత్యేకించి ఆహార పదార్థాలను రోడ్ల పై వేయడం వల్ల వీధి కుక్కలు,కోతులు,పిల్లుల వంటివి పెరిగిపోయేందుకు అవకాశం ఉందని అన్నారు. అందువల్ల రోడ్ల పై ఎక్కడ పడితే అక్కడ చెత్త వేయవద్దన్నారు. ఇటీవల కాలంలో వీధి కుక్కల కాటుకు అనేక మంది గురవుతున్నారని,దీనిని దృష్టిలో ఉంచుకొని కుక్కలకు స్టెరిలైజేషన్ చేయాల్సిన అవసరం ఉందన్నారు.పెంపుడు కుక్కలు,వీధికుక్కల కు వ్యాక్సిన్ వేసే కార్యక్రమాన్ని దేవరకొండ నుండి ప్రారంభించడం సంతోషమని అన్నారు.కుక్కలకు వ్యాక్సిన్ వేయించినప్పటికి పెంపుడు కుక్కల యజమానులు తప్పనిసరిగా వ్యాక్సిన్ తీసుకోవాలన్నారు.కుక్క కరిస్తే తప్పనిసరిగా దగ్గరలోని పి హెచ్ సి లో యాంటీ రేబిస్ ఇంజక్షన్ తీసుకోవాలని తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ పెంపుడుకుక్కల యజమానులను సన్మానించారు. దేవరకొండ ఆర్డీవో రమణారెడ్డి,మున్సిపల్ కమిషనర్, తదితరులు పాల్గొన్నారు.

## ప్రతి జంతువులను ప్రేమ దయ కరుణతో చూడాలి

**దేవరకొండ,ఆగస్టు 30,మన సాక్షి :**



ప్రతి జంతువులను ప్రేమ దయ కరుణతో చూడాలని నల్గొండ జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి తెలియజేశారు .జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల దేవరకొండలో విద్యార్థులను ఉపాధ్యాయులను , గ్రామస్తులను ఉద్దేశించి మాట్లాడుతూ పిల్లలు చిన్నప్పటి నుంచే జంతువులతో ప్రేమగా మెలగా లని తెలియజేశారు. ముందుగా దేవరకొండలో పెంపుడు కుక్కలకి సామూహిక టీకాలు కార్యక్రమాన్ని ప్రారంభించారు .ఇదే కార్యక్రమంలో పెంపుడు కుక్కలపై ఆసక్తి ఉన్న ఐదుగురు జంతు ప్రేమికులకు కుక్క పిల్లలను దత్తత ఇవ్వడం జరిగింది. తదుపరి ఉన్నత పాఠశాలలో ఏర్పాటుచేసిన సమావేశంలో మాట్లాడుతూ కుక్కల ద్వారా వ్యాప్తి చెందే రేబిస్ వ్యాధి ఎడల అప్రమత్తంగా ఉండాలి , కుక్కలను హింసించ కూడదు, కుక్కలు పరుగెత్తుకుంటూ వచ్చినప్పుడు సరైన జాగ్రత్తలు తీసుకోవడం ద్వారా మనం రక్షించుకునే విధానాన్ని తెలియజేశారు. ప్రమాదవశాత్తు కుక్క కాటుకు గురైనట్లయితే వెంటనే ప్రభుత్వ వైద్యశాలల్లో రేబిస్ టీకాలు చేపించుకొని వ్యాధి నుంచి రక్షణ పొందాలని తెలియజేశారు. అన్ని పెంపుడు కుక్కలకు రేబిస్ వ్యాధి నిరోధక టీకాలు పశువైద్యశాలల్లో అందుబాటులో ఉన్నాయని వెంటనే జిల్లాలోని అన్ని కుక్కలకు టీకాలు వేయించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పశుసంవర్ధక శాఖ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ జి వి రమేష్ రెవిన్యూ డివిజనల్ అధికారి రమణ రెడ్డి మున్సిపల్ కమిషనర్ సుదర్శన్ డాక్టర్ నర్మదఇతరులు పాల్గొన్నారు.

## ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో వినాయక విగ్రహానికి వినతి

**మిర్యాలగూడ, ఆగస్టు 30, మన సాక్షి:**



భారత విద్యార్థి ఫెడరేషన్ ఎస్ఎఫ్ఐ డివిజన్ కమిటీ ఆధ్వర్యంలో పట్టణంలో ప్రకాష్ నగర్లో వినాయకుని విగ్రహానికి వినతిపత్రం అందజేశారు.ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ డివిజన్ అధ్యక్షులు మూడవత్ జగన్ నాయక్ మాట్లాడుతూ అధికారంలోకి రాక ముందు విద్యార్థుల స్కాలర్షిప్ ఫీజు రీయింబర్స్మెంట్ వేంటనే విడుదల చేస్తామని,వక్ర బుద్ధితో మాట్లాడి అధికారంలోకి వచ్చిన తర్వాత విద్యార్థుల జీవితాలతో చెలగాటం ఆడుతున్నారని ఆరోపించారు. రాష్ట్ర వ్యాప్తంగా పెండింగ్లో ఉన్న స్కాలర్షిప్ ఫీజు రీయింబర్స్మెంట్ , సంక్షేమ హాస్టల్ విద్యార్థుల మెస్ కాస్మెటిక్ చార్జీలు విడుదల చేయాలని లేనిపక్షంలో వేలాది మంది విద్యార్థులతో...2న నల్లగొండ జిల్లాలో, రాష్ట్ర వ్యాప్తంగా అన్ని కలెక్టరేట్ ఎదుట నిర్వహించే ఆందోళనలో విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొనాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో హర్షవర్ధన్ రెడ్డి, తరుణ్,కార్తీక్, బాబు, సాయి పాల్గొన్నారు

## రాహుల్ గాంధీ దిష్టిబొమ్మ దహనం

**నాచారం, ఆగస్టు 30,మన సాక్షి:**



కాంగ్రెస్ నేతలు ప్రధాని మోదీ తల్లిని దూషిస్తూ అనుచిత వ్యాఖ్యలు చేయడాన్ని బీజేపీ నేతలు తీవ్రంగా ఖండించారు. వ్యాఖ్యలను నిరసిస్తూ నాచారం డివిజన్ బీజేపీ అధ్యక్షుడు కొమ్మగళ్ల నవీన్ కుమార్ ఆధ్వర్యంలో రాహుల్ గాంధీ దిష్టిబొమ్మను దహనం చేశారు. ప్రధాని మోదీకి క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమం లో రాష్ట్ర గిరిజన మోర్చా ప్రధాన కార్యదర్శి రవినాయక్, జిల్లా కిసాన్ మోర్చా ఉపాధ్యక్షులు రాగిరి మోహన్ రెడ్డి, కాటిపల్లి రవీందర్ రెడ్డి, అనిత రెడ్డి, మల్కా ప్రకాష్, రవికాంత్,రాజి రెడ్డి,దయ గౌడ్, డివిజన్ ప్రధాన కార్యదర్శిలు పాదం వెంకటేష్, ఉదయ్ కిరణ్ రెడ్డి, డివిజన్ ఉపాధ్యక్షులు వెంకట్ నాయక్, సురేందర్ స్వామి, శేఖర్ గుప్త, వరలక్ష్మి, జ్యోతి రెడ్డి, భాస్కర్ వెంకటేశ్వర్లు, వెంకటేష్, కృష్ణ గౌడ్, శేఖర్, కౌశిక్, శ్రీమూర్తి నాగరాజు,, కిషోర్ తదితరులు పాల్గొన్నారు

## ప్రత్యేక పూజలు..అన్నప్రసాద వితరణ

**నాచారం,ఆగస్టు 30,మన సాక్షి:**



నాచారం డివిజన్ పరిధిలోని అన్నపూర్ణ కాలనీ పెయింటర్ అసోసియేషన్, భవాని నగర్, ఎర్రకుంట, మల్లాపూర్ లలోని వినాయక మండపాలను మేడ్చల్ అర్బన్ జిల్లా అధికార ప్రతినిధి, భాగ్యనగర్ గణేష్ ఉత్సవ సమితి ఉప్పల్ అసెంబ్లీ కో- కన్వీనర్ పోతగాని గోపాల్ గౌడ్ దర్శించుకుని ప్రత్యేక పూజలో పాల్గొన్నారు. అనంతరం అన్న ప్రసాద వితరణ కార్యక్రమంలో పాల్గొన్నారు.ఈ కార్యక్రమంలో రాజిరెడ్డి, గంధమల్ల గోపి, భాగ్యనగర్ గణేష్ ఉత్సవ సమితి నాచారం డివిజన్ కల్చరల్ ఇంచార్జ్ మంజులవాణి, కళావతి తదితరులు పాల్గొన్నారు.

# యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలి

జిల్లా ప్రధాన న్యాయమూర్తి కె. నాగరాజు అభిభాషణ

**నల్లగొండ,ఆగస్టు 30, మన సాక్షి:**




యువత అంతా చెడు వ్యసనాలకు బానిసకాకుండా సమాజంలో మంచి మనుషులుగా ఎదగాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి కె. నాగరాజు అన్నారు. శనివారం నాగార్జున ప్రభుత్వ కళాశాలలోని సాంస్కృతిక విభాగం,ఎన్ సి సి, ఎన్ఎస్ఎస్ విభాగాలు మరియు జిల్లా న్యాయసేవల అథారిటీ ఆధ్వర్యంలో న్యాయ అవగాహన సదస్సు జరిగింది. ఈ కార్యక్రమంలో భాగంగా ర్యాగింగ్, డ్రగ్స్, గిరిజనుల హక్కుల పైన విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమానికి జిల్లా ప్రధాన న్యాయమూర్తి ముఖ్యఅతిథిగా విచ్చేసి మాట్లాడుతూ భారతీయ న్యాయసేవల ఆథారిటీ వక్షాన ఈ అవగాహన సదస్సు ఏర్పాటు చేశామని అన్నారు. విద్యార్థులు ఎలాంటి నేరాలకు, వ్యసనాలను లోనుకాకుండా జాగ్రత్తవడాలని సూచించారు. ఒకసారి కేసైతే భవిష్యత్లో ఎలాంటి ప్రభుత్వ ఉద్యోగం రాదనే విషయం గుర్తుంచుకోవాలని అన్నారు. మన భారతీయ సంప్రదాయాల ప్రకారం మనిషికి నాలుగు ఆశ్రమాలున్నాయని అందులో బ్రహ్మచర్యాశ్రమమే ప్రధానమైందని అన్నారు.అంతకు ముందు సమావేశానికి అధ్యక్షత వహించిన కళాశాల ప్రిన్సిపాల్ డా. సముద్రాల ఉపేందర్ మాట్లాడుతూ కళాశాలలో ఇలాంటి న్యాయ అవగాహన సదస్సులు నెలకు ఒకసారైనా పెట్టాలని జిల్లా న్యాయసేవల విభాగాన్ని కోరారు. అనంతరం కార్యక్రమానికి గౌవర అతిథిగా విచ్చేసిన జిల్లా అదనపు న్యాయమూర్తి,ఫ్యామిలీ కోర్టు న్యాయమూర్తి కె. దుర్గాప్రసాద్ మాట్లాడుతూ చట్టానికి సంబంధించిన విషయాలు సాధారణంగా బోర్ గానే ఉంటాయని కాని దానితో పని వడినప్పుడు అవి ఇష్టంగా మారుతాయని అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సివల్ సివిల్ జడ్జి, కార్యదర్శి వి. పురుషోత్తం రావు, సర్కిల్ ఇన్స్పెక్టర్ బి. ప్రసాద్, జిల్లా గిరిజన సంక్షేమశాఖ అధికారి చత్రు నాయక్,మహాత్మాగాంధీ విశ్వవిద్యాలయం ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ డా. మద్దిలేటి, బార్ అసోషియేషన్ అధ్యక్షులు కె. అనంత రెడ్డి, జన విజ్ఞాన వేదిక కందుకూరి సుదర్శన్, వైస్ ప్రిన్సిపాల్స్ డా. వి. రవి కుమార్, డా. అంతటి శ్రీనివాస్, సాంస్కృతికశాఖ కార్యదర్శి డా. వెల్దండి శ్రీధర్, ఎన్సిసి ఆఫీసర్ సుదాకర్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారులు డా. బి. అనిల్ కుమార్, వెంకటరెడ్డి, డా. ఏ. మల్లేశం, కోటయ్య, శివరాణి, సావిత్రి, అధ్యాపకులు డా. మునిస్వామి, డా. ఎం. అనిల్ కుమార్, కోర్టు సూపరింటెండెంట్లు రాంబాబు, స్వర్ణలత, ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు ఎన్సిసి కేడెట్స్, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

# రాజకీయ పార్టీలకు సరైన గుణపాఠం చెప్పాలి

**మిర్యాలగూడ, ఆగస్టు 30, మన సాక్షి:**



తెలంగాణ రాష్ట్రంలో బిసి రిజర్వేషన్లపై కపట ప్రేమ నటిస్తూ ఇంతకాలం కాలయాపన చేసిన రాజకీయ పార్టీల నిజస్వరూపం బయటపడిందని తెలంగాణ బీసీ సంక్షేమ సంఘం ఉమ్మడి నల్లగొండ జిల్లా అధ్యక్షులు పోగుల సైదులు గౌడ్ అన్నారు.గత కొంతకాలంగా నలభై రెండు శాతం రిజర్వేషన్లు ప్రకటిస్తూ రాష్ట్ర ప్రభుత్వ తీర్మానం మేము కూడా అనుకూలమే అంటూ ఊదరకోడుతు విపక్ష పార్టీలు నిరసనలు, ధర్నాలు, నిరాహార దీక్షలు అంటూ కాలయాపన చేస్తూ డ్రామాలాడారన్నారు.తెలంగాణ ప్రభుత్వం అసెంబ్లీలో ప్రవేశపెట్టిన 42 శాతం రిజర్వేషన్లు స్పష్టమైన చట్టం చేయకుండానే తూ తూ మంత్రంగా పార్టీ పరంగా ప్రభుత్వపరంగా రిజర్వేషన్లు అంటూ స్థానిక సంస్థల ఎన్నికలకు పోవడానికి సిద్ధమైన అన్ని రాజకీయ పార్టీల నిజస్వరూపం బయటపడింది అన్నారు.ఇదంతా చూస్తున్న బీసీ సమాజం ఇప్పుడున్న రాజకీయ పార్టీలకు సరైన కూడా పాఠం చెప్పడానికి సిద్ధంగా ఉండాలన్నారు.అందుకోసం పార్టీలకతీతంగా రాష్ట్రవ్యాప్తంగా అర్హత కలిగిన బీసీలందరూ స్వతంత్రంగా పోటీల్లో నిలబడాలన్నారు.జై బిసి అనే నినాదంతో బీసీలంతా బీసీ కి ఓటు వేసుకుంటే బీసీల రాజ్యాధికారం స్థానిక సంస్థలతో మొదలవుతుందన్నారు.ఒక్కసారిగా బీసీల బలమేందో అన్ని రాజకీయ పార్టీలకు తెలుస్తుంది అన్నారు.ఈ కార్యక్రమంలో తెలంగాణ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర సంయుక్త కార్యదర్శి శిరసినవాడ నరసింహ, జిల్లా కార్యదర్శి పెరిగేటి వెంకటాచారి ,శివరామకృష్ణ,వెంకన్న, రామకృష్ణ,సతీష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## చండీ హెూమంలో..ఎమ్మెల్యే బిఎల్ఆర్



**మిర్యాలగూడ, ఆగస్టు 30, మన సాక్షి:**

పట్టణంలోని హనుమాన్ పేటలో చండీ హెూమంలో ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి పాల్గొని..శిరిడి సాయి బాబాను దర్శించుకున్నారు. అనంతరం స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. వారి వెంట కాంగ్రెస్ పార్టీ నాయకులు స్కైలాబ్ నాయక్,మాజీ కౌన్సిలర్లు దేశిడి శేఖర్ రెడ్డి, గోవర్ధన చారి, 25వ వార్డు కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ గోదాల జానకి రామ్ రెడ్డి తదితరులు ఉన్నారు.

## విఘ్నేశ్వరుడికి ప్రత్యేక పూజలు



**శంకర్‌పల్లి,ఆగస్టు 30,మన సాక్షి:**

శంకర్‌పల్లి మండల పరిధి మోకిల గ్రామ శివారులో గల సఫైర్ అపార్ట్మెంట్ లో శనివారం విఘ్నేశ్వరుడి ప్రత్యేక పూజలో ప్రముఖ వ్యాపారస్తుడు మహిపాల్ రెడ్డి, ఐబిఎస్ కళాశాల ప్రొఫెసర్ అంజిరెడ్డి దంపతులు పాల్గొని, విగ్నేశ్వరుని ఆశీస్సులు తీసుకున్నారు. అనంతరం భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు. వారు మాట్లాడుతూ లంబోదరుని యొక్క ఆశీస్సులు ప్రతి ఒక్కరి పైన ఉండాలని కోరుకున్నారు. ఈ కార్యక్రమంలో గోవింద్, మాణిక్ రెడ్డి, గోపాల్ రెడ్డి, ఉపేందర్ రెడ్డి, మధు రెడ్డి, అర్జున్ రెడ్డి, బాలకృష్ణారెడ్డి, నర్సింలు, మౌనిక రెడ్డి పాల్గొన్నారు.

## ఓటర్ జాబితాపై అఖిలపక్ష సమావేశం

**నడిగూడెం,ఆగస్టు 30,మన సాక్షి:**



వచ్చే గ్రామ పంచాయతీ సాధారణ ఎన్నికల కొరకు వార్డుల వారిగా గ్రామపంచాయతీ కార్యాలయం నందు ముద్రించిన వాటర్ లిస్ట్ పై నడిగూడెం ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీడీవో మల్సూర్ నాయక్ అధ్యక్షతన శనివారం అన్ని పార్టీల మండల అధ్యక్షులు, కార్యదర్శులతో సమీక్ష నిర్వహించారు.సమీక్షలో పలువురు నాయకులు మాట్లాడుతూ ఓటర్ లిస్టు తప్పులు తడకగా ఉందని, ఒకే కుటుంబానికి సంబంధించిన కుటుంబ సభ్యుల ఓట్లు వేరు వేరు వార్డులలో ఉన్నాయని అలాంటి ఓట్లను సవరించాలని అధికారులకు సూచించారు.ఓటర్ లిస్టులో సవరణలు కొరకు దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి, డీఎఫ్ఓ సతీష్ కుమార్,తహసిల్దార్ రామకృష్ణారెడ్డి, ఎంపీఓ విజయ్ కుమారి, సూపరిండెంట్ సయ్యద్ ఇమామ్, అఖిలపక్ష నాయకులు దున్న శ్రీనివాస్, పల్లా నర్సిరెడ్డి,బెల్లంకొండ సత్యనారాయణ,బండారు వీరబాబు,మిట్టగడుపుల మోష పాల్గొన్నారు.

## నిరుపేద విద్యార్థులకు నిత్యవసర సరుకులు పంపిణీ

**మిర్యాలగూడ,ఆగస్టు 30, మన సాక్షి:**



పట్టణంలోని హౌసింగ్ బోర్డు కాలనీలో సరస్వతీ శిశుమందిర్ అవాసములో పేద విద్యార్థులకు ఒక నెలకు సరిపోను నిత్యావసర సరుకులను స్థానిక హనుమాన్ పేటకు చెందిన జూలూరు ఉమాశంకర్-స్వాతి అందజేశారు.ఈ కార్యక్రమంలో ఆర్ఎస్ఎస్ నగర కార్యవహా సుధాకర్, మాజీ కౌన్సిలర్ చిలుకూరి శ్యామ్,అవాసం ముఖ్యులు చెన్న శ్రీను, తలకోల శ్రీనివాస్,చేరుపల్లి కరుణాకర్,పట్టణ అధ్యక్ష, ఉపాధ్యక్షులు బంటు గిరి, పోరెడ్డి శ్రీను,దత్త గణేష్, శివ,అభి అవాసం విద్యార్థులు పాల్గొన్నారు.

## రైతులకు తప్పని యూరియా కష్టాలు..!

- కేంద్రాల వద్ద రైతుల పడిగాపులు

**మిర్యాలగూడ/వేములపల్లి,మన సాక్షి:**



పంటలు సాగు చేసి నెలలు గడుస్తున్న రైతులకు యూరియా కష్టాలు తప్పడం లేదు.యూరియా కోసం గంటల తరబడి క్యూ లైన్ లో నిలబడాల్సిన పరిస్థితి ఏర్పడింది. నల్లగొండ జిల్లా వేములపల్లి మండలంలోని రావులపెంట గ్రామంలో రెండు ఆగ్రో కేంద్రాలకు 20 టన్నుల యూరియా వచ్చింది. విషయం తెలుసుకున్న రైతులు తెల్లవారుజాము నుంచే ఆధార్ కార్డుతో క్యూ లైన్ లో వేచి ఉన్నారు. వచ్చిన లోడు వచ్చినట్టు ఖాళీ అవుతుండడంతో ముందు వచ్చిన వాళ్లకు మాత్రమే యూరియా దక్కుతుంది. మిగిలిన రైతులు నిరాశగా వెను తిరిగి వెళ్లే పరిస్థితి ఎదురవుతుంది.ఆగ్రో కేంద్రంలో ఒక రైతుకు ఒక యూరియా బస్తా అందజేశారు.గతంలో ఎన్నడు లేని విధంగా యూరియా కోసం క్యూ లైన్లో గంటల తరబడి వేచి ఉండే పరిస్థితి ఏర్పడిందని రైతులు వాపోతున్నారు.ఆగ్రో కేంద్రాల వద్ద ఎలాంటి సంఘటన చోటు చేసుకోకుండా పోలీసు వారు బందోబస్తు చేపట్టారు.

## స్థానిక ఎన్నికలకు పార్టీ శ్రేణులు సిద్ధం కావాలి



**మిర్యాలగూడ,ఆగస్టు 30, మన సాక్షి:**

స్థానిక ఎన్నికలకు పార్టీ శ్రేణులు సిద్ధం కావాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు మాజీ శాసనసభ్యులు జూలకంటి రంగారెడ్డి పిలుపునిచ్చారు. శనివారం మండలం తక్కెళ్ళపాడు గ్రామంలో సిపిఎం సీనియర్ నాయకులు అమరజీవి కామ్రేడ్ మైనం కిషన్ రావు 35 వర్ధంతి సభ కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా స్థూపానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.అమరవీరులు ఆశయ సాధన జరగాలంటే ప్రజా సమస్యల పరిష్కారం కోసం నడుం బిగించి కమ్యూనిస్టుల కొట్లాడాలని కోరారు.అదే స్ఫూర్తితో రాబోయే స్థానిక ఎన్నికల్లో అన్ని స్థానాల్లో సిపిఎం తరఫున పోటీ చేయడానికి పార్టీ శ్రేణులు సిద్ధంగా ఉండాలని సూచించారు.

ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు వీరేపల్లి వెంకటేశ్వర్లు, మండల కార్యదర్శి రవి నాయక్, జిల్లా కమిటీ సభ్యులు చౌగాని సీతారాములు,మల్లు గౌతమ్ రెడ్డి మండల కమిటీ సభ్యులు చౌగాని వెంకన్న, శాఖ కార్యదర్శి గుండు నాగయ్య, మండల నాయకులు చినగాని సైదమ్మ, కందుకూరు రమేష్ బాబు జిల్లా నగేష్, చిరుమళ్ళ బిక్షం,నాగ్ హుసేన్, కోటిరెడ్డి,సువార్త, లింగయ్య, సోమయ్య, బ్రాహ్మచారి, రామేశ్వర చారి, తదితరులు పాల్గొన్నారు.

Edited, Printed, Published and Owned by MALLE NAGI REDDY Printed at LAXMI PUBLICATIONS H.No. 28-891/9, Journalist Colony, Chinthapally X Road, Miryalagda, Dist: Nalgonda-508207, Telangana.and Published at H.no.. 28 - 891/9, Chinthapally Bypass X Road, Miryalagda, Dist: Nalgonda-508207, Telangana."Editor: MALLE NAGI REDDY. RNI NO. TELTEL/2022/83470. Cell: 9666924232. gmail Id: manasakshi.in@gmail.com.